
ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జనవరి 18, 2015
కథా నాయకుని
కథ

వెయ్యి చిత్రాల ఇళయ రాజా



సంగీత మాంత్రికుడు ఇళయరాజా చేసిన చిత్రాల సంఖ్య ఇటీవలే వెయ్యికి చేరుకుంది. 'చీనీ కమ్, పా, షామితాబ్' చిత్రాల దర్శకుడు ఆర్.బాల్కీ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 20వ తేదీన ఓ కార్యక్రమాన్ని రూపొందించనున్నారు. ముంబైలో జరగనున్న ఈ పండుగకు 'రాజా సర్'ను సాదరంగా ఆహ్వానించనున్నారు. వెయ్యి సినిమాల ప్రస్థానంలో ఆయనకు సహకరించిన గాయనీ గాయకులు, సినీ దర్శకులు, పాటల రచయితలు, నటీనటులు... అందరినీ ఆహ్వానించాలన్న ఆలోచన కూడా వుందట. నిజానికి వారందర్నీ పిలవడం కొంచెం కష్టసాధ్యమైన పనే. కానీ బాల్కీ ఓ జాబితాను తయారుచేస్తున్నారట. రాజా సర్ తొలి చిత్రం 'అన్నాకిలి'లో స్వరాలు ఆలపించిన గాన కోకిలలు పి. సుశీల...ఎస్.జానకి నుంచి వెయ్యవ చిత్రం 'షామితాబ్'లో పాడిన అమితాబ్ బచ్చన్ వరకు మహామహుల పేర్లు ఆ జాబితాలో తప్పక వుంటాయని సమాచారం. విశేషం ఏమంటే... లతా మంగేష్కర్ ఇప్పటికి రాజా సర్ చిత్రాలలో ఒక్కటంటే ఒక్కదానికే (రాజ్‌కుమార్ సంతోషి 'లజ్జ') పాడారు. భారీ ఎత్తున నిర్వహించనున్న కార్యక్రమానికి ఈమె కూడా విచ్చేసి నిండుదనం తేనున్నారు. ●

చెవిటి అమ్మాయిగా...

అందాలు ఆరబోసే పాత్రలు చేసీ చేసీ బోరు కొట్టిందేమో! భిన్నమైన చిత్రాల్లో నటించాలని ఉబలాటపడుతోంది నయనతార. అందులో భాగంగానే హారర్ చిత్రం 'మాయ'లో నటించింది. ఆ ఊపులోనే విఘ్నేష్ శివన్ తమిళ చిత్రం 'నానుమ్ రౌడీధాన్'లో చేయడానికీ అంగీకరించింది. ఇందులో... విజయ్ సేతుపతి జోడీగా ... చెవిటి అమ్మాయిగా నయన్ కనిపించనుంది. 'అయితే ఈ పాత్ర సీరియస్‌గా వుండదు. హాస్య ప్రధానంగా నవ్వులు పండిస్తుంది. నయన్ చాలా చక్కగా నటిస్తోంది...' అన్నది టాక్. పాండిచ్చేరిలో ఇప్పటికే చిత్రానికి సంబంధించిన ప్రధానమైన భాగాన్ని చిత్రీకరించారట. ●

మెగామైక్ పట్టనున్న 'అమృత'

మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అమృత'. సిమ్రాన్, మాధవన్ పెంపుడు కుమార్తె అమృతగా తెలుగు వారి మన్ననలు పొందిన బాల నటి కీర్తన. పసితనంలోనే అంత గడుసు పిల్లగా నటించిన కీర్తన ఖచ్చితంగా హీరోయిన్ అవుతుందనుకున్న వారూ లేకపోలేదు. ఈ మధ్యే చెన్నైలో డిగ్రీ పూర్తి చేసిన ఈ పూర్వ బాలనటి ... కథానాయిక అవకాశాలు వెతుక్కోలేదు. సరాసరి దర్శకుడు త్యాగరాజన్ దగ్గర అసిస్టెంట్‌గా చేరింది. నిజానికి కీర్తన తల్లిదండ్రులిద్దరూ (సీత, పార్తీపన్) చిత్రరంగానికి చెందినవారే. తల్లి తెలుగు, తమిళ, మళయాళ కథా నాయికగా సుపరిచితురాలు. తండ్రి తమిళ హీరో, దర్శకుడు. చూడగా... చూడగా...కీర్తన తన తండ్రి నుంచి పొందిన స్ఫూర్తితో దర్శకత్వం వైపు మొగ్గుచూపినట్టు కనిపిస్తోంది మరి! ●

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కానుక కనుక...

కానుక...గిఫ్ట్...తోఫా...! భాష ఏదైతేనేం! అర్ధం పరమార్ధం ఒక్కటే. కాదనలేనిది...మొహమాటం అడ్డొచ్చేది...కానుక పుచ్చుకునేటప్పుడే. నిజానికి కానుక అంటే తిరిగి ఇవ్వనవసరం లేనిది అని అర్ధం. కోట్ల సంవత్సరాల మానవ ప్రస్థానంలో ఈ చిన్ని మాట... సంప్రదాయం... ఎప్పుడు పుట్టిందో ... ఎందుకు పుట్టిందో...ఖచ్చితంగా చెప్పడం కూసింత కష్టమే!

ఎదుటివారికి తమ ప్రేమాభిమానాలను ప్రదర్శించడానికి... కానుకలు ఇస్తుంటారు సహజంగా. చావుపుట్టుకలు ... ఆ మధ్యలో జరిగే పెళ్లి...సందర్భంగా కానుకలు ఇవ్వడం సంప్రదాయం.

పిల్లలు, 'పెద్ద'ల దగ్గరకు వెళ్లేప్పుడు ఉత్త చేతులతో వెళ్లకూడదని పెద్దలు చెప్తుంటారు. అందుకే పుష్పమో..ఫలమో...తోయమో...పట్టుకెళ్లి సమర్పించుకుంటుంటాం.

సరొగేట్ మదర్లు, క్రష్షులు వచ్చాక... అమ్మ ప్రేమ, తల్లి పాలు కూడా వ్యాపారమయమైపోయాయి. ఇక కానుకలెంత?! ఈ గిఫ్టుల గురించి బిజినెస్‌మెన్‌కు తెల్సినంతగా మరెవ్వరికి తెలీదు. పుట్టిన రోజు, పెళ్లి రోజు, పోయిన రోజు, తల్లుల తండ్రుల రోజులు, ప్రేమికుల రోజు... ఒకటనేముంది!? అన్ని రోజులూ కానుకలు ఇచ్చుకోడానికి 'మాంచి' సందర్భాలే. తల్లికి, తండ్రికి, ప్రేయసికి ఆ రోజున కానుక ఇవ్వకపోతే ప్రేమ లేనట్టేననేస్తున్నారు. ఇవి చాలక...గిఫ్టు కూపన్ల వలలు చిక్కగా అల్లి ...జాగ్రత్తగా పరుస్తున్నారు. ఆ వలలో చిక్కిన వారు ... భ్రమలో పడినవారు ... అంతే సంగతులు!

◆ మనలో మాట

కష్టసాధ్యమైన పనులను సైతం సుసాధ్యం చేసే శక్తి సామర్థ్యాలను ఈ కానుకలకు ఆపాదించేశారు. అందుకే వ్యాపార లావాదేవీల్లో మునిగితేలేవారు...తమ ఫైళ్లు కదలాలన్నా...వాటిమీద సంతకాలు పడాలన్నా... కానుకలు సమర్పించుకుంటుంటారు 'పెద్దల'కు. దాంతో...లంచానికి కానుకకు మధ్యలో వున్న రేఖ క్రమక్రమంగా చెరిగిపోతోంది.

ట్రెండ్ ఎప్పుడూ ఒకటిగానే వుండదు. మారుతుంటుంది. అది కానుకల విషయంలోనూ జరుగుతోంది. ఈ మధ్య ఎదురు కానుకలు ఇవ్వడం ఎక్కువైంది. పుట్టినరోజు, నిశ్చితార్థం, పెళ్లి, చావు...ప్రతీ సందర్భంలోనూ! అదొక స్టేటస్ సింబలైపోయింది మరి.

రాజకీయ నాయకుల రూటే వేరు. కానుకల విషయంలోనూ అంతే. ముందుగా పార్టీ నిధికి భారీ సూట్కేసుల్లో కానుకలు పంపిస్తారు. ప్రతిగా ఎన్నికల్లో పార్టీ సీట్లు పొందుతారు. అంత ఖర్చు చేసి గెల్చాక ... ఊరకే పనులు చేస్తారా! కానుకలు అందివ్వాల్సిందే...కూల్ చెయ్యాల్సిందే! ■

టపా

మంచి సమాచారం

జనవరి 04 స్నేహలో ప్రచురితమైన అంశాలన్నీ బాగున్నాయి. ముఖ్యంగా అట్టమీది కథలో రకరకాల నవ్వుల గురించి చదువుతుంటే ఇన్ని రకాల నవ్వులున్నాయా అనిపించింది. ప్రతి వారం వస్తున్న ప్రేమ విప్లవం సీరియల్ ఆకట్టుకునేలా ఉంది. దీన్ని ఒక పుస్తకంగా ప్రచురిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. చూద్దామాలో వచ్చిన పోలాండ్‌లో సందర్శనీయ ప్రదేశాలు, వాటి విశేషాలు, హిట్లర్ దాష్టికానికి సాక్ష్యంగా మిగిలిన మృత్యు కుహరాలు వంటి విషయాల గురించి వ్యాసకర్త బాగా చెప్పారు. 'అమ్మ' కథ ఫర్వాలేదు. సామాజిక చైతన్యం కలిగించే కథలు ఇస్తే బాగుంటుంది. కామిక్ పుస్తకాల గురించి మంచి సమాచారమిచ్చారు.

పి.ఇందిర, కర్నూలు

ప్రయత్నం అభినందనీయం

సమ్‌థింగ్ స్పెషల్‌లో 'పేరుకే క్లీన్ ఎనర్జీ ఆచరణలో కాలుష్యమే' బాగుంది. థర్మల్ విద్యుత్ ప్రాజక్టులవల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. హక్కులు కోల్పోతున్నారు. కాలుష్యాన్ని అరికట్టడానికి అనేక చర్చలు కొనసాగుతున్నాయి. అగ్రరాజ్యాలు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. ప్రజలను వంచిస్తున్నారు. ఈ వాస్తవాలను ప్రజలకు తెలియచేసేందుకు మీరు చేసిన ప్రయత్నం అభినందనీయం. ప్రేమ విప్లవం సీరియల్ బాగుంటుంది. అంతేకాకుండా డిసెంబర్28,2014 ఆదివారం అనుబంధం స్నేహలో సమాజానికి కావాల్సిన 30 పుస్తకాల గురించి పరిచయం చేసారు. పుస్తకాలు విజ్ఞానపు గని. ప్రసార మాధ్యమాలు ఎన్ని వచ్చినా పుస్తకంతో పోలికలేదు. పుస్తకాల పండుగలు నిజంగా అవి పాఠకులకు వేడుక. వాటి గురించి ఇచ్చిన సమాచారం ఎంతో ఆకట్టుకుంది. ముఖ్యంగా విజయవాడలో జరిగే పుస్తక పండుగ గురించి చెప్పడం బాగుంది. పుస్తకం ఒక మార్గదర్శి. ఒక సిరా చుక్క వేయి మెదళ్లను కదిలిస్తుంది. పుస్తకమే నిజమైన స్నేహితుడు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ

ఆసక్తి కలిగించాయి

'అమ్మ'కథ బాగుంది. 'రోబో' సేవ కులు వస్తున్నారు కూడా బాగుంది. టెక్నాలజీ గురించి మంచి సమాచారం ఇస్తున్నారు. ఆత్మబలం సినిమా గురించి చెప్పిన విషయాలు బాగున్నాయి. అయితే అందులో పాత్రల గురించి మాత్రమే చెప్పారు. సినిమా సంగీతం, దర్శకత్వం గురించి కూడా వివరిస్తే ఇంకా బాగుండేది. స్నేహలో పద వినోదం, సుడోకు లాంటి మెదడుకు పదును పెట్టే పజిల్స్‌లాంటివి కూడా ఇస్తే బాగుంటుంది. సినిమా కబుర్లులో పాత తరం నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించి కూడా ఇస్తే బాగుంటుంది. ఒళ్లను స్ప్రింగులా తిప్పేస్తున్న అమ్మాయి గురించి, చేతిలో చిల్లి గవ్వ లేకుండానే దేశాలు పర్యటించిన ఇద్దరి మిత్రుల గురించి చదువుతుంటే వింతగానూ, ఆసక్తిని కలిగించే విధంగానూ ఉన్నాయి.

ఎమ్.విశ్వనాథరెడ్డి, హిందూపురం

అలాంటి కథలు ఇవ్వండి

కామిక్ కథానాయకులు, పుస్తకాలు అందులో పాత్రల గురించి చెప్పడం నాకు నచ్చింది. అందులో చాచా చౌదరి, తెనాలి రామన్ కథలు, అక్బర్ బీర్బల్ కథలు పిల్లలు, పెద్దలు కూడా తప్పక చదవాలి. అవి నవ్వుతెప్పించేవి మాత్రమే కాదు గుణ పాఠాల్ని, సందేశాల్ని కూడా తెలియజేస్తాయి. బాల నేస్తాలు బాగుంది. అందులో అప్పుడప్పుడు చిన్న నీతి కథ ఇస్తుంటారు. ఈ సారి ఇవ్వలేదు. అలాంటి కథలు ఇవ్వగలరు. 'అమ్మ' కథ నాటకీయంగా ఉంది. వాస్తవానికి దగ్గరగా ఉన్న కథలను ఇస్తే పాఠకులను ఆకట్టుకుంటుందని నా అభిప్రాయం. 'టెక్ గురు' శీర్షికలో అన్ని పనులు చేసే రోబోల గురించి ఇచ్చారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకోవడం అవసరం. ముఖ్యంగా చెస్, షటిల్ ఆడే రోబోలు, వంట చేసే రోబోలు, సులువుగా సర్జరీ చేసే రోబోల గురించి చదువుతుంటే రానురాను టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో తెలుస్తుంది.

బి. కాత్యాయని దేవి, మార్కాపురం

ఈ సంచికలో....

కథానాయకుని కథ

కవర్‌స్టోరీ ———— 14

నందమూరి తారక రామారావు... ముచ్చటగా ఎన్టీయార్... ఆ పేరు తెలుగు వారి గుండెలపై చెరగని చేవ్రాలు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా, ఆపై ప్రజా జీవితంలో జనహృదయ విజేతగా ఆయనది ఒక విలక్షణ ప్రస్థానం. సైకిలుకు బిం-దె కట్టుకొని, కిలోమీటర్లు ప్రయాణించి పాలు అమ్మిన సామాన్య రైతు కుటుంబంలోని యువకుడు జనసామాన్యాన్ని ఉర్రూతలూపి, వెండితెర వేల్పుగా మారిన వైనం ఆశ్చర్యకరం. కృషి, పట్టుదల, ఏకాగ్రతలతో శ్రమిస్తే మామూలు స్థాయి మనిషే మహోన్నతుడిగా ఎదుగుతాడనడానికి ఎన్టీయార్ మన కళ్ళెదుటి ఉదాహరణ.

వింతలోకం 3
బార్‌లో నూలు వడకొచ్చు

జీవితం 4
లంచ్ బాక్స్ బామ్మ

నాట్యమ్ 5
పురుషుల నృత్యమ్ 'గోటిపువ'

కథ 6
దీపం

చూద్దామా 8
ఆ నౌక వయసు 388 ఏళ్లు

ఆరోగ్యంగా...ఆనందంగా... 10

అవి ఇవి 11
దేశాలు దాటిన దినుసులు

సమ్‌థింగ్ స్పెషల్ 12
తల్లిదండ్రులకు ఆశాభంగం

కవిత్వమ్ 13
చికిత్స

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
సోయా స్పెషల్స్

బాలనేస్తాలు 22
ఈ చిన్నోడెవరో చెప్పుకోండి

కొత్త పుస్తకాలు 24
కదిలించే కథలు

శునకాహార రుచి చెప్పాలి

'కూటి కోసం కోటి విద్యలు' అన్న మాట వినే వుంటాం. అలాంటిదే ఇప్పుడు మనం చెప్పుకోబోయే ఒకానొక విశేషం. ఇదిగో ఈ ఫొటోలో కనిపిస్తున్న బ్రిటన్ పెద్దమనిషి పేరు తాలో జెన్. ఈయనగారి ఉద్యోగం ఏంటనుకున్నారు? కుక్కల ఆహారం రుచి చూసి ఎలా వుందో చెప్పడం! ఎక్కడనుకున్నారు? 'లిలీస్ కిచెన్ పెట్ ఫుడ్' అనే కంపెనీలో. డబ్బాల్లో వుండే కుక్కల ఆహారాన్ని పళ్లెంలో పెట్టుకుని మరీ కొద్దిగా రుచి చూసి అది శునకాలకు నచ్చుతుందో లేదో, అవి ఇష్టంగా తినగలవో లేదో ఈయన చెప్పాలి. జీతం ఎంత వుంటుందనరుకుంటున్నారు? ప్రారంభ రోజుల్లో ఏడాదికి 30,000 డాలర్ల జీతం ఇస్తారు. అదే మాంచి అనుభవజ్ఞుడికైతే 75 వేల డాలర్లు ముడుతుంది. అదీ విషయం!

సింహాలు వెంట పడుతుంటే...

సింహం అంటే భయం లేనిది ఎవరికి చెప్పండి?! అలాంటిది మన వెనక కొన్ని సింహాలు పడుతుంటే ఎలా వుంటుంది? భయంతో బిక్కచచ్చిపోమూ! అసలు ఆ ఘటనలో మనల్ని ఊహించుకోవడానికే వణికిపోతాం. అలాంటిది కావాలని కోరి మరీ డబ్బు కట్టి వెళ్తున్నారంటే నమ్ముతారా? చైనాలో 'లెహె లెడు వైల్డ్ లైఫ్ జూ'కి వెళ్తే ఇప్పటి వరకు మనం చదువుకున్నదంతా కళ్లారా చూడొచ్చు. జూ అనగానే ఎన్‌క్లోజర్‌లోనో, ఇనుప పంజరాల్లోనో వున్న క్రూర జంతువులను చూస్తుంటాం. కానీ ఇక్కడ సందర్శకులను వాహనాల్లో జూ అంతా తిప్పి చూపిస్తారు. జంతువులు మాత్రం స్వేచ్ఛగా విహరిస్తుంటాయి. మరో ఒళ్లు గగుర్పొడిచే విషయమేమంటే... వీరు ప్రయాణిస్తున్న వాహనాలకు మాంసపు ముక్కలు వేళ్లాడదీస్తారు. దాంతో సింహాలు ఆ మాంసం కోసం బళ్ల వెనకే వస్తాయి. ఇనుప చట్రం వుంటుంది కాబట్టి... ప్రమాదమేమీ వుండదు. సందర్శకులు తమ కాళ్ల చేతులను...మాత్రం దూరంగా వుంచుకోమని చెప్తుంటారు జూ నిర్వాహకులు. ఇలా కూడా జూలో జంతువులను చూస్తారా? అనిపించినా...మరో మూడు నెలల వరకు టికెట్ల రిజర్వేషన్ అయిపోయిందట ఇప్పటికే.

బార్‌లో నూలు వడకొచ్చు

ఇదెక్కడి వింత అనుకుంటున్నారేమో! జపాన్ రాజధాని టోక్యోలో వుంది. పేరు 'టోక్యో కాటన్ విలేజ్'. ఇక్కడకు వచ్చిన వారు మందు ఆర్డర్ చేస్తే చాలు. ఇదిగో ఇలా నూలు వడికేందుకు ఏర్పాట్లు చేస్తారు బార్ ఉద్యోగులు. మనకు వింతగా అనిపిస్తున్నా... నూలు వడుకుతుంటే మనసుకు ప్రశాంతంగా వుంటుందని, వారానికి రెండు మూడు సార్లు కూడా వస్తుంటామని కొందరు కస్టమర్లు చెప్తున్నారు. దాంతో...ఆఫీసులో జరిగిన తలనొప్పి వ్యవహారాల నుంచి బైట పడతుంటానని యొషికో అనే కస్టమర్ చెప్తున్నాడు. ఇంతకీ ఈ ఐడియా ఎవరిది? ఎందుకొచ్చింది? అన్న అనుమానాలు కూడా వచ్చే వుంటాయి. ప్రకటనల రంగంలో పని చేసే టకుయ అనే వ్యక్తి మానస పుత్రిక ఈ బార్. ఆయనగారికి పత్తి నుంచి నూలు వడుకుతుంటే చాలా ప్రశాంతంగా అనిపించేదట. పైగా ఆకలి కూడా విపరీతంగా అయ్యేదట. దాంతో తన ఉద్యోగం మానేసి ... ఒక బార్ పెట్టేసి... ఇలా ఔత్సాహికులకు నూలు వడికే అవకాశం కల్పిస్తున్నాడు.

భారీ వృషభం

వావ్! ఏంటి ఇంత పెద్ద ఎద్దా! ఇంతకీ ఎంత బరువుంటుంది? ఏ దేశంలో వుంటుంది? అని ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించకండి. అంత ఆసక్తికరమైన అంశాలను వెంటనే చెప్పేస్తే ఏం బావుంటుంది? అందుకే నిదానంగా...నిమ్మళంగా... విషయంలోకెళదాం. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఎద్దుగా రికార్డులకెక్కిన దీని పేరు ఫీల్డ్ మార్షల్. బ్రిటన్‌లో పుట్టింది. వయసు ఎనిమిది సంవత్సరాలు. అప్పుడెప్పుడో... బరువు చూసినప్పుడు సింపుల్‌గా 1670 కేజీల బరువుంది. దీనికి ఓట్లు, బార్లీ, బంగాళదుంపలంటే మహా ఇష్టం. దీన్ని చూడ్డానికి వచ్చే సందర్శకులకేం కొదవలేదు. రెండు పౌండ్లు కట్టి మరీ చూస్తారు.

ఎనిమిది పదుల వయసంటే...! కంటి చూపు ఆనదు. శరీరం సహకరించదు. కడుపు నిండా తినలేరు. ఆకలికి ఆగలేరు. కాసేపు కూర్చోవాలన్నా... నాలుగడుగులు వేయాలన్నా... ఓపిక వుండదు. సరిగ్గా... ఆ వయసులో... ఇద్దరు బామ్మలు బతుకుపోరు సాగిస్తున్నారు. చెయ్యి చాచకుండా... చేతనైన పనులు చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నారు.

లంచ్ బాక్స్ బామ్మ

ఆ మామ్మ పేరు తిరుపతమ్మ. కృష్ణా జిల్లా...చిట్టి గూడూరు గ్రామ వాసి. బొమికలకు చర్మం తొడిగి కుట్టినట్టు కనిపిస్తుంది. వయసు ఎనభై. కట్టుకున్న వాడు ఇరవైయేళ్ల కిందటే కాలం చేశాడు. దాంతో అప్పటి వరకు అతను చేసిన పనిని తను చేపట్టింది. పొరుగూళ్లో పని చేసే తమ ఊరి హమాలీలకు క్యారేజీలు తీసుకెళ్లి అందిస్తుంది. క్యారేజీకి ఐదు రూపాయలు. ఎండ, వాన, చలి... దేన్నీ లెక్క చేయక... సరిగ్గా భోజన సమయానికి బాక్సులు అందించడం తిరుపతమ్మ ప్రత్యేకత. ముందుగా హమాలీల ఇళ్లకెళ్లి వారి ఆడాళ్లు కట్టిచ్చే క్యారేజీలు సేకరిస్తుంది. వాటిని ఓ గంపలోకి సర్దుకుని... పదకొండు గంటలకల్లా బస్టాండుకు చేరుతుంది. బస్సో, ఆటోనో పట్టుకొని ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణించి... మచిలీపట్నం చేరుకుంటుంది. అక్కడ పనుల్లో వున్న హమాలీలకు వారి ఇళ్ల నుంచి తెచ్చిన క్యారేజీలు అందిస్తుంది. వాటి మీద పేర్లు వున్నా లేకున్నా ... సరిగ్గా ఎవరి క్యారేజీ వారికి ఇస్తుంది. నిజానికి ఆవిడకు చదవడం కూడా రాదు. కానీ తనదైన కొండ గుర్తులు పెట్టుకుని అందించడం తిరుపతమ్మ స్పెషాలిటీ. గతంలో యాభై మందికి క్యారేజీలు అందించేది. ఇప్పుడు కేవలం పాతిక మందికే ఇస్తోంది. రాను పోను బస్సు(ఆటో) చార్జీలు పోను రోజుకు చేతికి అందేది 80 రూపాయలు.

చిప్స్ మామ్మ

ఫోటో మాత్రమే చూసి బామ్మ గురించి ఏం చెప్పగలరో చూద్దాం. 'ఆమెకు ఎనభై ఏళ్లకు పైనే వుంటాయి. ఎక్కడో రోడ్డు మీద కూర్చుంది. చిప్స్ ఏవో అమ్ముతున్నట్టుంది' అనిపిస్తుంది ఎవరికైనా. ఊహించిన వన్నీ సరైనవే. కాకపోతే వయసే మరో నాలుగేళ్లు ఎక్కువేసుకోవాలి. పేరు షీలా ఘోష్. ఈ మధ్యే సంపాదించే కొడుకు చనిపోవడంతో ... పొట్ట కూటి కోసం ఇదిగో ఈ పని చేపట్టింది. ఈమెది కలకత్తా. అక్కడి నుంచి ప్రతి రోజూ రెండు బస్సులు మారి 'ఎక్సైడ్' చేరుకుంటుంది. అక్కడే పేవ్‌మెంట్ మీద కూర్చుని చిప్స్ అమ్ముతుంది. ఆమెను చూసిన వారెవ్వైనా సరే...జాలి పడి ... ఆర్థిక సాయం చేయబోయినా...చిప్స్ పొట్లానికి ఎక్కువ డబ్బులు ఇవ్వబోయినా తీసుకోదు.

సరిగ్గా పాకెట్ ధర ఎంతో అంతే అందుకుంటుంది. ఆ వీధిలో సంచరించే వారందరికీ షీలా బామ్మ సుపరిచితురాలే. ఆమె ఉచితంగా ఎవ్వరి దగ్గరా ఏమీ తీసుకోదని అందరికీ తెలిసిపోయింది. కానీ ఆమెకు ఎలాగైనా సాయం చేయాలన్న ఉద్దేశంతో ఓ మార్గాన్ని కనిపెట్టారు స్థానికులు. తమకు అవసరం వున్నా లేకున్నా... ఆమె దగ్గర చిప్స్ పొట్లాలు కొనుగోలు చేస్తుంటారు. కృతజ్ఞతగా... బామ్మ బోసి నవ్వులు రువ్వడాన్ని ఎవ్వరూ మర్చిపోలేరు. ఆ నవ్వులో ఎలాంటి స్వార్థం వుండదు. ఆప్యాయత తప్ప. పాకెట్లన్నీ అమ్ముడయ్యాక... మళ్లీ రెండు బస్సులు మారి ఇల్లు చేరుతుంది. మార్గమధ్యలో ఎవరైనా ఏదైనా తిండి పదార్థాలు ఇవ్వబోయినా తీసుకోదు. పాన్ మాత్రం తింటుంది. అదీ తన డబ్బుతో కొన్నవి మాత్రమే. మామూలుగా కూడా ఏవైనా తినడానికంటే...టీ తాగడానికే చిప్స్ బామ్మ ఉత్సాహం కనబరుస్తుంది.

మాంచి వయసు... చక్కటి ఆరోగ్యం... కావాల్సినంత ఖాళీ సమయం... వున్న వారు కూడా పని మనుషుల మీద ఆధార పడడం చూస్తుంటాం. అలాంటిది ... ఓపికంతా ఆవిరై.... వయసుడిగి పోయిన తిరుపతమ్మ బామ్మ, షీలా ఘోష్ మామ్మ ... నాలుగు మెతుకుల కోసం నానా తిప్పలు పడడానికి కారణమెవ్వరు? ఆ వయసులోనూ వారి బాధ్యత చేపట్టలేని బిడ్డలా? ఓట్లు మాత్రమే గుద్దించుకునే ప్రభుత్వాలా? సోదర సమాజమా? ఆలోచించాలి!

◆ నాట్యమ్

శాస్త్రీయ నృత్యరీతుల ప్రస్తావన వచ్చిందంటే మన తెలుగువారి మదిలో కూచిపూడి నాట్యం స్ఫురణకు వస్తుంది. కూచిపూడి అనగానే 'భామ' ప్రస్తావన తప్పనిసరిగా ఉండి తీరాల్సిందే. అయితే ఒకప్పుడు ఈ సత్యభామ పాత్ర పురుషులు మాత్రమే ధరించేవారు. అంతెందుకు? కూచిపూడి భాగవతులంతా పురుషులే. తర్వాత వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి కృషితో స్త్రీలు కూడా ఇందులో భాగమయ్యారు. అయితే ఇలా పురుషులు మాత్రమే నర్తించే సంప్రదాయం మరో రాష్ట్రంలో ఉంది.

◆◆◆◆

పురుషుల నృత్యం 'గోటిపువ'

ఆ రాష్ట్రం ఒరిస్సా అయితే .... ఆ నృత్య రీతి 'గోటిపువ'. ఒరియా భాషలో గోటి అంటే ఏక, పువ అంటే బాలుడు. నేటికీ ఈ నృత్యాన్ని పురుషులు మాత్రమే ప్రదర్శిస్తున్నారు. ఎన్నో శతాబ్దాలుగా ఒరిస్సాలో ఈ 'గోటిపువ' నాట్యాన్ని స్త్రీ వేషం ధరించిన యువకులే ప్రదర్శిస్తున్నారు. వీరు జగన్నాథుడు, శ్రీకృష్ణుని స్తుతిస్తూ నర్తిస్తారు. పూర్వం ఒరిస్సా దేవాలయాల్లో నర్తించేందుకు ప్రత్యేకంగా కొందరు ఉండేవారు. వారినే దేవదాసీలు (మహారీలు) అని పిలిచేవారు. వారు జగన్నాథస్వామికి అంకితమైపోయేవారు. కోణార్క్ సూర్యదేవాలయం, పూరీ జగన్నాథ దేవాలయాల వంటి పురాతన దేవాలయాలపై చెక్కిన శిల్పాలు ఈ సంప్రదాయానికి సాక్ష్యాలుగా చెప్పవచ్చు. అంటే క్రీస్తుశకం 1194వ సంవత్సరంలో అనంగ భీమదేవుడు జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో నట మందిరం నిర్మించాడు. ఈ కాలంలోనే జయదేవుడు గీతా గోవిందం రచించాడు. క్రీస్తుశకం 1600వ సంవత్సరం నుండి మహారీలు దేవాలయాల్లోనే కాకుండా రాజస్థానాలలో కూడా నృత్యం చేయసాగారు. అప్పటి నుండి క్రమంగా దేవదాసీలు సమాజంలో తమ స్థానాన్ని క్రమంగా కోల్పోతూ వచ్చారు. ఈ సమయంలో దేవదాసీ సంప్రదాయాన్ని నిలబెట్టే ఉద్దేశంతో అందమైన బాలురు స్త్రీ వేషాలు ధరించి దేవస్థానాల్లో, రాజాస్థానాల్లో నృత్యం చేయడం ఆరంభించారు. బోయి ప్రభువైన రామచంద్ర దేవ కాలంలో ఈ పద్ధతి మొదలైంది. ఇలా స్త్రీ వేషాలు ధరించి నర్తించే బాలురను 'గోటిపువ' అంటారు. వీరిది సఖీభావ నృత్యం. జగన్నాథ స్వామి ఉత్సవాలలో, చందన యాత్రలో, ఝూలన్ యాత్రలో మహారీలు, గోటిపువలు కూడా పాల్గొనేవారు.

గోటిపువ నృత్యం ఒడిస్సీ సంప్రదాయం లోనిదే. కానీ నర్తించే విధానం, వేషధారణ, ప్రదర్శించే విధానం మహారీలకు భిన్నంగా ఉంటుంది. ఈ నృత్య సంప్రదాయంలో నర్తకులే స్వయంగా ఆలపిస్తారు. నేటి ఒడిస్సీ నాట్యం గోటిపువ సంప్రదాయ స్ఫూర్తితోనే ప్రదర్శితమౌతోంది. నేడు మనం గొప్ప వాళ్లుగా చెప్పుకుంటున్న కేలూ చరణ్ మహాపాత్ర వంటి గొప్ప గురువులు, నర్తకులు ఒకప్పుడు అంటే చిన్ననాటి గోటిపువలే. ఒడిస్సీ సంప్రదాయం తాండవ (పురుషుల ఉద్ధత నాట్యం), లాస్య (స్త్రీల సుకుమార విన్యాసం) ఆధారంగా ఉంటుంది. ఒడిస్సీ నాట్యంలో ముఖ్యంగా ప్రస్తావించవలసింది త్రిభంగి. ఒడిస్సీ ప్రదర్శన రీతిలో కూచిపూడి, భరతనాట్యాల పోలిక ఉన్నప్పటికీ సంగీతం మాత్రం హిందుస్థానీ పద్ధతికి చెందినది.

బంధ నృత్యం

గోటిపువ నృత్యంలో ఆసక్తికరమైన అంశం బంధ నృత్యం. ఈ నృత్యం వ్యాయామ భంగిమలు, కదలికలను పోలి ఉంటుంది. శరీరంలోని వివిధ అంగాలను చాలా క్లిష్టమైన జటిలమైన భంగిమల్లో ప్రదర్శించడం వల్ల దీనిని బంధనృత్యం అంటారు. ఈ కఠినమైన అంగహారాలను ప్రదర్శించడానికి అనువుగా శరీరాన్ని మార్చడానికి మగపిల్లలు తమ ఐదవ, ఆరవ యేటే ఈ నాట్య సాధన ఆరంభిస్తారు. ఈ భంగిమలు సాధారణంగా పురాణాలలోని శ్రీకృష్ణుని జీవితానికి సంబంధించిన వివిధ ఘట్టాలను ప్రతిబింబింపచేస్తాయి.

15వ శతాబ్దానికి చెందిన మహేశ్వర మహాపాత్ర రచించిన అభినయ చంద్రిక ఒడిస్సీ నాట్యానికి సంబంధించిన హస్తముద్రలు, పాదభేదాలు, స్థాన బంధాలు, చలనాలు (చారులు, భ్రమరులు), నృత్య ప్రదర్శనారీతి మొదలైన వాటిని గూర్చిన వివరణలన్నీ అందిస్తుంది.

17వ శతాబ్దంలో రచించిన 'సంగీత దర్పణం'లో సంగీత నాట్యాలకు సంబంధించిన పూర్తి వివరాలు వున్నాయి.

ఆహార్యం

'గోటిపువ'లు సుకుమారమైన లాస్యరీతిని ప్రదర్శించేందుకు వీలుగా... తమ కేశాలను పొడవుగా పెంచుకొని ముడివేసుకుంటారు. పూలమాలలతో అలంకరించుకుంటారు. తెలుపు, ఎరుపు రంగులలో వుండే పౌడర్‌ను కలిపి ముఖానికి మేకప్ చేసుకుంటారు. కళ్లకు కాటుక, నుదుట ఎర్రని తిలకం ధరిస్తారు. తిలకానికి చుట్టూ చందనంతో తీర్చిదిద్దుతారు. వీరి సంప్రదాయిక ఆహార్యం కంచుల. ముదురు రంగులో వుండే రవిక (బ్లౌజ్) యాప్రాన్‌ను పోలిన వస్త్రం, ఎంబ్రాయిడరీ చేసిన సిల్క్ వస్త్రం నడుము చుట్టూ కాళ్ల దగ్గర (ఫ్రిల్) కుచ్చు వచ్చేలా ధరిస్తారు. దీనినే 'నిబిబంధ' అంటారు. అయితే కాలానికి అనుగుణంగా ఈ సంప్రదాయిక వేషధారణలో కూడా మార్పు వచ్చింది. నగల విషయానికొస్తే చేతులకు, మెడకు, చెవులకు ప్రత్యేకంగా పూసలతో డిజైన్ చేసినవి ధరిస్తారు. ముక్కుకు నేడు కుట్టిం చుకునే పని లేకుండా రంగుతో చిత్రించే పద్ధతి వచ్చింది. కాళ్లకు గజ్జెలు ధరిస్తారు. ఎర్రటి ఆల్తాను పాదాలకు అలంకరించుకుంటారు.

- సింహాద్రి నాగశిరీష

◆ కథ

దీపం

సంగాపు వెంకట కోటేశ్వరరావు
9493507172

'నేనెక్కవలసిన రైలు జీవితకాలం లేటు' అన్నారు ఆరుద్ర. 'తానెక్కవలసిన బస్సు ఒక గంట లేటు' మనస్సులో అనుకుంది సాహిత్య. ఎంతకూ రాని బస్సుమీద కోపం కలగలేదు సాహిత్యకు. ఇది తన సహనానికి మొదటి పరీక్ష అనుకుంది. తను జీవితంలో మొదటి సారిగా ఉద్యోగపర్వంలోకి అడుగిడబోతోంది. ఎన్ని సందర్భాల్లో తను సహనాన్ని ప్రదర్శించాలో పెదవులపై అప్రయత్నంగా చిరునవ్వు మెరిసింది.

ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఎక్కవల్సిన బస్సు వచ్చింది. బెల్లం చుట్టూ ఈగల్లా బస్సు చుట్టూ జనం. తన ప్రయత్నం లేకుండానే బస్సు ఎక్కేసింది. తనకు కిటికీ ప్రక్కనే సీటు దొరికింది. బస్సునిండా జనం. అదేమిటో ఎక్కడ చూసినా జనం...జనం... బస్సుల్లో....రైళ్లల్లో .... సినిమా ధియేటర్లలో షాపింగ్‌మాల్స్‌లో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్సులో , కార్పొరేట్ ఆసుపత్రుల్లో జనం...జనం.... 'ఈ రూట్‌లోని బస్సులన్నీ ఎప్పుడూ ఇలానే ఉంటాయి' అంటున్నారెవరో. 'ఈ బస్సు మిస్సయితే మరో రెండుగంటల వరకు బస్సులేదు' తన ముందు సీట్లో కూర్చున్న పెద్దాయన పక్కనే ఉన్న వ్యక్తితో అంటున్నాడు. పంచెకట్టు పెద్ద మనుషులు, టక్ చేసుకున్న దొరబాబులు, ముతక చీరలు, జరీ అంచు పట్టుచీరలు కట్టుకున్న వాళ్లు అందరూ బస్సులో ప్రత్యక్షం.

నిండు గర్భిణిలా బస్సు కదిలింది. తెరిచివున్న కిటికీలో నుండి చల్లని గాలి తనను పలకరించి పరవశింపచేస్తోంది. మనస్సు పొరల్లో దాగున్న జ్ఞాపకాలు తెరమీద బొమ్మల్లా కదలాడుతున్నాయి.

◆ ◆ ◆

సాహిత్యకు పాతికేళ్లుంటాయి. అనంత విశ్వంలోని అపారమైన విజ్ఞానాన్ని తనలో నిక్షిప్తం చేసుకున్న అపర సరస్వతిలా ఉంటుంది. బి.ఏ,బి.ఎడ్ పూర్తిచేసింది. డి.ఎస్.సి పరీక్ష రాసి టీచర్ ఉద్యోగం సంపాదించింది. సాహిత్యకు మొదటి నుండీ టీచింగ్ ప్రొఫెషన్ అంటే ఇష్టం. తను ఎలిమెంటరీ స్కూల్లో చదివే రోజుల్లో, సాయింత్రాలు 'టీచర్ ఆట ఆడుకుందాం రా !' అంటూ ఇంటిపనిలో ఉన్న వాళ్లమ్మను పిలిచేది. తను బెత్తం పుచ్చుకుని ఒక కుర్చీలో కూర్చొని, ఎదురుగా వాళ్లమ్మను కూర్చోబెట్టి, నెంబర్సు, టేబుల్సు చెప్పమనేది. సుద్దముక్కతో గదిగోడల నిండా రాసేది. అది చూసి వాళ్లమ్మ ముసిముసి నవ్వులు నవ్వుకునేది. తను హైస్కూలు చదువుకు వచ్చాక, అక్కడి ఉపాధ్యాయులను నిశితంగా పరిశీలించేది. వారి హావభావాలు, వేషభాషలు, క్లాస్‌రూంలో పాఠం చెప్పేతీరు శ్రద్ధతో గమనించేది. సాహిత్య సహజంగా చురుకైన పిల్ల కావడంతో టీచర్లందరూ తనను ఇష్టపడేవాళ్లు. అన్ని సబ్జెక్టుల్లోనూ మంచి మార్కులు తెచ్చుకునేది.

తను పదవతరగతి చదువుతుండగా ఒక రోజు సోషల్ మాష్టారు క్లాసులోని పిల్లలందర్నీ

"మీ భవిష్యత్తు ప్రణాళిక ఏమిటని"

అడిగాడు. డాక్టర్లవుతామని కొందరు, ఇంజనీర్లవుతామని కొందరూ, రాజకీయ నాయకులమవుతామని మరికొందరూ...రకరకాలుగా చెప్పుకుపోతున్నారు. సాహిత్య వంతు వచ్చింది.

"సాహిత్యా ! నువ్వే మవుదామనుకుంటున్నావు ?"

"నేను టీచరవుదామనుకుంటున్నాను సార్" చెప్పింది. " వెరీ గుడ్ ! టీచరువై భావి భారత పౌరులను తీర్చిదిద్దుతావన్న

మాట "

◆ ◆ ◆

ఏదో స్టాపు వచ్చినట్లుంది. బస్సు ఆగింది. ఇద్దరు దిగారు. నలుగురు ఎక్కారు. బస్సు కదిలింది. మనస్సులో తన ఆలోచనలూ గతం వైపు కదిలాయి. తండ్రికి మాత్రం సాహిత్యను మెడిసిన్ చదివించి డాక్టరుగా చూడాలని కోరిక.

"మనమ్మాయి తెల్లకోటు ధరించి, మెళ్లో స్టెతస్కోపుతో ఆసుపత్రిలో రోగుల మధ్య అటూఇటూ హడావుడిగా తిరుగుతుంటే చూడాలనుంది రాజ్యం " అనేవారు అమ్మతో.

'నాన్నగారూ ! నాకు టీచింగ్ ప్రొఫెషనంటే ఇష్టం. నేను టీచరవుతాను' అనగానే 'నీ ఇష్టం అమ్మా' అన్నారు నాన్న. నాకు ఉద్యోగం వచ్చినప్పుడు నాకన్నా ఎక్కువ అమ్మానాన్నే ఎగిరిగంతేశారు. "మొదటి సారిగా వెళు తున్నావు. నేను కూడా వస్తానమ్మా " అన్నారు నాన్న. "ఫరవాలేదు నాన్నగారూ ! మీరు పక్కనుంటే మీరున్నారన్న భరోసా ఉంటుంది. నేను ఒంటరిగా ప్రయాణిస్తే బాధ్యత పెరుగుతుంది " అంది నవ్వుతూ. తమ్ముడు బైక్

మీద బస్టాండు వరకు డ్రాప్ చేశాడు. తను బస్సెక్కేవరకు ఉండి ‘ బై ’ చెప్పి వెళ్లిపోయాడు.

‘జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన కోసం కృషి చేయాలి. కలలు కనటమే కాదు, ఆ కలలు నిజమవ్వాలంటే కష్టపడాలి ’ అన్న సోషల్ మాస్టారు మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. తన కల నిజంకాబోతున్నందుకు ఆనందంగా ఉంది సాహిత్యకు.

నలభై కిలోమీటర్ల దూరాన్ని గతం తాలూకూ ఆలోచనలు మింగేశాయి. తను దిగవలసిన స్టాప్ వచ్చింది. బస్సు దిగాక మరో ఆరు కిలోమీటర్లు ఆటోలో ప్రయాణం. గతుకుల రోడ్డు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు. దూరంగా పొలాల్లో పనిచేస్తున్న మనుషులు. ఎట్టకేలకు మారుమూలనున్న ఆ పల్లెటూరు చేరుకుంది సాహిత్య. ఊరికి ఒక వైపున దట్టమైన అడవి, మరోవైపు ఎతైన కొండలు, పచ్చని పంటపొలాలు, గలగలమని ప్రవహించే పంటకాలువలు, ఊరికి కొంచెం దూరంలో పొలాల మధ్య అందమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం. చేయి తిరిగిన చిత్రకారుడు, అందమైన కాన్వాసుపై చిత్రించిన అద్భుతంలా కనిపిస్తున్నాయి చుట్టూ పరిసరాలు. పాఠశాల భవనంలోకి అడుగుపెట్టింది సాహిత్య.

“ఎవరుకావాలమ్మా” అంటూ ఎదురొచ్చి అడిగాడు అటెండరు వెంకటేశం. “హెడ్మాష్టారుగారిని కలవాలి”

“రండమ్మా” అంటూ ఆఫీసు రూంలోకి తీసుకెళ్లాడు వెంకటేశం.

“నమస్కారం సార్ ! నాపేరు సాహిత్య. ఇక్కడ సోషల్ టీచరుగా అపాయింటయ్యాను” హ్యాండ్‌బ్యాగ్‌లో నుండి అపాయింట్ మెంట్ ఆర్డరు తీసిచ్చింది. హెడ్మాష్టారు ప్రకాశరావు గారు పలకరింపుగా నవ్వారు. అపాయింట్‌మెంట్ ఆర్డరు అందుకొని, “కూర్చోమ్మా” అంటూ తన ఎదురుగా ఉన్న కుర్చీ చూపించారు. అటెండెన్స్ రిజిష్టరులో పేరురాసి, సాహిత్య చేత సంతకం చేయించారు. స్కూలు గురించి , అక్కడి వాతావరణం గురించి చెప్పారు. తన వివరాలు అడిగి తెలుసుకున్నారు. టైం టేబుల్ ఇచ్చారు. “ఇక్కడ ప్రాబ్లమ్స్ ఏమీ ఉండవమ్మా, కావాలని మనం కోరి తెచ్చుకుంటే తప్ప. ఎంత బాగా చదువు చెపితే అంతలా గౌరవిస్తారు. విష్ యూ బెస్టాఫ్ లక్” అని వెంకటేశాన్ని పిలిచి సాహిత్యకు స్టాఫ్‌రూం చూపించమన్నారు.

◆ ◆ ◆

సాయంత్రం స్టాఫ్ మీటింగు ఎరేంజిచేసి, సాహిత్యను స్టాఫ్ అందరికీ పరిచయం చేశారు. అక్కడి పరిసరాలు సాహిత్యనెంతో ఆకట్టుకున్నాయి. అందమైన స్కూలు బిల్డింగ్, విశాలమైన ఆవరణం, ఆవరణ చుట్టూ కొబ్బరిచెట్లు, రకరకాల పూలమొక్కలు, విరిసీవిరియని మొగ్గల్లాంటి పిల్లలు..... ఒకరిద్దరు తప్ప స్టాఫ్ అందరూ పట్నం నుండి వచ్చేవాళ్లే. తాను మాత్రం పనిచేసే చోటే నివాసం ఉండాలని నిర్ణయించుకుంది. వెంకటేశాన్ని ఊళ్లో ఇల్లు చూసి పెట్టమంది.

“ఈ ఊళ్లో సౌకర్యాలు ఉండవు అమ్మగారూ, పైగా రాత్రిళ్ల అడవి జంతువులు ఊళ్లోకొస్తాయి” అన్నాడు.

“ఫర్వాలేదు, ఇక్కడ ఉండే వాళ్లందరూ మనుషులేగా” అంది నవ్వుతూ. ఏమనుకున్నాడో ఏమో వెంకటేశం మరో మాట మాట్లాడలేదు.

మంచి ఇల్లే దొరికింది. కార్పొరేట్ కల్చర్‌తో కలుషితం కాని ఊరది. అక్కడి వాళ్లందరూ

“ గతుకుల రోడ్డు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు. దూరంగా పొలాల్లో పనిచేస్తున్న మనుషులు. ఎట్టకేలకు మారుమూలనున్న ఆ పల్లెటూరు చేరుకుంది సాహిత్య. ఊరికి ఒక వైపున దట్టమైన అడవి, మరోవైపు ఎతైన కొండలు, పచ్చని పంటపొలాలు, గలగలమని ప్రవహించే పంటకాలువలు, ఊరికి కొంచెం దూరంలో పొలాల మధ్య అందమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం. చేయి తిరిగిన చిత్రకారుడు, అందమైన కాన్వాసుపై చిత్రించిన అద్భుతంలా కనిపిస్తున్నాయి చుట్టూ పరిసరాలు. ”

కాయాకష్టం, చేసుకొని బతికేవాళ్లే. అన్ని వృత్తుల వాళ్లూ ఉన్నారు. నిజమైన శ్రమైఖ్య జీవన సౌందర్యం కనపడింది సాహిత్యకు. పిల్లలు కూడా పనులకు వెళితే కానీ పూటగడవని కుటుంబాలు చాలా ఉన్నాయి. సీజన్‌లో మల్లెపూలు కోయడం, పత్తి తీయడం, మిరపకాయలు గ్రేడింగు చేయడం, అక్కడి పిల్లలకు అలవాటు, అవసరం కూడాను. సాహిత్య కలుపుగోలుతనం వల్ల తనకు పిల్లలందరూ బాగా అలవాటయ్యారు. మేడం, మేడం అంటూ సాహిత్య చుట్టూనే తిరుగుతున్నారు. సాహిత్య కూడా పిల్లల సమస్యలకు సానుకూలంగా స్పందించి వారికి అవసరమైన సాయం చేస్తుండేది. వాళ్లకు నోటుబుక్స్ కొనివ్వడం, పెన్నులు, పెన్సిళ్లు కొనివ్వడం, నీతి కథలు చెప్పడం, క్విజ్ పోటీలు నిర్వహించి, చిన్న చిన్న బహుమతులిచ్చి ప్రోత్సహించడం...తను అలా చేయడం చూసి

“అమ్మా , టీచర్లందరూ నీలాగే ఉంటే బడి బయట పిల్లలే ఉండరమ్మా” అంటూ అభినందించేవాడు హెడ్మాష్టారు.

సాహిత్య ఉద్యోగ పర్వంలో ఆరు నెలలు గడిచాయి. ఇటు విద్యార్థుల్లోనూ, అటు తల్లిదండ్రుల్లోనూ మంచిపేరు తెచ్చుకొంది. “గుర్తింపు కోసం పాకులాడకు. నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించుకుంటూపోతే గుర్తింపు నీ వెంటే నడుచుకుంటూ వస్తుంది” అన్న సోషల్ మాష్టారు మాటలను మనసులోనే కాదు జీవితంలోనూ ఇనుమడింపచేసుకుంది సాహిత్య. పంచకట్టు, పొడవు చేతుల చొక్కా, పైన ఉత్తరీయం, భూతద్దాల కళ్లజోడు, జీవితాన్ని కాచివడపోసిన అనుభవం...ఇవన్నీ మూర్తీభవించిన సోషల్ మాష్టారు.... ఆయన చెప్పిన మాటలే సాహిత్య వృత్తి జీవితానికి పునాదులు.

సాహిత్య పిల్లల పట్ల చూపించే శ్రద్ధ, వృత్తి నిబద్ధత చూసి అందరూ తనను అభిమానించేవారు. అది చూసి సహించలేని కొందరు సహ ఉపాధ్యాయులు మాత్రం

“సర్వీసుకు కొత్తగదా ! కొంత కాలం పోతే తెలుస్తుంది. దేశాన్ని ఉద్ధరించడానికి బయలుదేరిందండీ ! వేడి రక్తం కదా మాష్టారూ ! కొంతకాలం పోతే చల్లబడుతుంది” అంటూ రకరకాలుగా తనపై వ్యంగ్యాస్త్రాలు సంధించేవారు. అయినా వాటన్నింటినీ నవ్వుతూ స్వీకరించేది .వారితోనూ ప్రేమగా మెలిగేది. హెడ్మాష్టారు మాత్రం సాహిత్య వృత్తి నిబద్ధత చూసి మెచ్చుకునేవారు. ఆమె పిల్లల పట్ల ప్రవర్తించే తీరును అభినందించేవారు.

◆ ◆ ◆

ఒకరోజు పాఠశాల ఆఫీసు గదిలో హెడ్మాష్టారు. అటెండరు వెంకటేశంతో

“పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాలంటే బెత్తం అవసరం లేదయ్యా, మనస్సుంటే చాలని సాహిత్యను చూస్తుంటే అర్థమవుతుంది” అన్నాడు.

“నిజం సార్, పిల్లలందరూ మేడంగారికి అభిమానులైపోయారు” సమాధానంగా చెప్పాడు వెంకటేశం.

తరగతి గది నుండి స్టాఫ్ రూం వైపు వెళుతున్న సాహిత్యకు ఆ మాటలు వినిపించాయి. ఒక్క క్షణం ఆగింది. ఆమెకు తన సహ ఉపాధ్యాయులు విసిరే వ్యంగ్యాస్త్రాలు, హెడ్మాష్టారి గారి అభినందనలూ రెండూ ఒకేలా వినిపించాయి ... అనిపించాయి.

“అజ్ఞానమనే చీకటిని పారద్రోలాలంటే జ్ఞానం అనే దీపం వెలిగించాలి. చీకటిని పోగొట్టాలన్నా, జ్ఞాన దీపాలు వెలిగించాలన్నా అది ఉపాధ్యాయులకే సాధ్యం. సమాజం ఆదర్శంగా ఉండాలంటే ఆదర్శమైన ఉపాధ్యాయులుండాలి” అన్న సోషల్ మాష్టారు మాటలు మననం చేసుకొని ముందుకు నడిచింది సాహిత్య... ✦

◆ చూద్దామా

పోలాండ్ తర్వాత నేను చూసిన దేశం స్వీడన్. నా రూమ్మేట్ శశి వాళ్ల తమ్ముడు స్వీడన్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శశి తన తమ్ముడ్ని చూడటానికి స్వీడన్ వెళ్తూ నాకూ ఆహ్వానం పలికాడు. దాంతో నేను పోలాండ్ నుండి సరదాగా స్వీడన్ చూద్దామని తమిళతంబితో బయలుదేరా. విమాన యాన సంస్థ 'విజ్జ్ ఎయిర్' పోలాండ్‌లోని పోజ్నాస్ నుండి స్వీడన్‌కు విమానాలు నడుపుతుంది. మేము నివశించే మింజు జేర్జ్ నుండి సొంత కారులో పోజ్నాస్‌కు బయలుదేరాం.

ఆ నౌక వయస్సు 388 ఏళ్లు

అలా బయలుదేరామో లేదో చినుకులు మొదలయ్యాయి. విపరీతమైన ట్రాఫిక్ జామ్. మాకు అక్కడ ఫ్లైట్ సమయం మించిపోతుంది. కంగారు కంగారుగానే సాగింది ప్రయాణం. ఎట్టకేలకు సమయానికి చేరుకున్నాం. కాని అనివార్య కారణాల వల్ల గంటన్నర ఆలస్యంగా వచ్చింది విమానం. యూరోపియన్ యూనియన్లో సభ్యదేశాలుగా ఉన్నా సరే స్వీడన్, డెన్మార్క్, నార్వే దేశాలని మాత్రం స్కాండినేవియన్ దేశాలుగా పిలుస్తారు. కొన్ని సందర్భాల్లో ఫిన్ లాండ్, ఐస్ లాండ్ దేశాలు కూడా ఆ కోవలోకే వస్తాయని అంటారు కొంతమంది. యూరప్‌లో అన్ని దేశాలు రోడ్డు, రైలు ద్వారా కలిసే ఉంటాయి కాని స్వీడన్ మాత్రం మధ్యలో సముద్రం ఉండటంతో కేవలం వాయు, జల మార్గాల ద్వారానే మిగతా దేశాలతో అనుసంధానమై ఉంటుంది. ఇప్పుడు మేం వెళ్లేది స్వీడన్ రాజధాని స్టాక్ హోం నగరం. పోజ్నాస్ నుండి గంటలో స్టాక్ హోం ఏయిర్ పోర్టుకు చేరుకున్నాం. అక్కడ నుండి నగరంలోకి రావడానికి మరో గంట బస్సు ప్రయాణం. టిక్కెట్స్ అన్నీ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాం. దాంతో ఎక్కడా ఆలోచించాల్సిన అవసరం రాలేదు. మమ్మల్ని రిసీవ్ చేసుకున్నాడు శశి తమ్ముడు శరవణన్. స్వీడన్ కరెన్సీ పేరు క్రోనా. ఒక పోలిష్ జిలోటికి రెండు క్రోనాలు వస్తాయి. మెట్రో స్టేషన్ కౌంటర్‌లో మనిషికి 200 క్రోనాలు చెల్లించి స్మార్ట్ కార్డు తీసుకున్నాం. ఆ కార్డుతో మూడు రోజులపాటు స్టాక్ నగరంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. స్టేషన్ నుండి శరవణన్ ఫ్లాట్‌కు వెళ్లాలంటే పదిహేను నిమిషాల బస్సు ప్రయాణం. పోలాండ్ కన్నా ఇక్కడ చలి కొంచెం ఎక్కువనే ఉంటుంది. ఎందుకంటే పసిఫిక్ ధృవానికి దగ్గరగా ఉండటం చేత. ఈ దేశంలో హిమ పాతం కూడా ఎక్కువేనట. బస్టాప్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్నాం. అక్కడ మేము ఎదురుచూస్తున్న బస్సు 9.43నిమిషాలకు వస్తుందని డిజిటల్ డిస్ ప్లేలో చూపిస్తోంది. అది చూసి నాకు నవ్వొచ్చింది. మన దగ్గర కూడా బస్సు టైమింగ్స్ హోర్డింగ్‌లు పెడతారు. కానీ అవి సమయానికి ఎప్పుడూ రావుకదా. నా వెటకారపు నవ్వును అర్థం చేసుకున్న శరవణన్, వెంటనే తన ఐఫోన్ తీసి అందులో ఒక అప్లికేషన్ చూపించాడు. అదేంటంటే అక్కడ రవాణా వ్యవస్థ అంతా జిపిఎస్ తో అనుసంధానమై ఉంటుంది. ఆ అప్లికేషన్ సహాయంతో ఏ బస్సు ఎక్కడ ఉంది. ఏ సమయానికి చేరుకుంటుందో తెలుసుకోవచ్చు. ఒక వేళ ట్రాఫిక్‌లో ఆలస్యమైతే జిపిఎస్ ద్వారా ఆ బస్సు ఉన్న దూరాన్ని గ్రహించి ఆటోమాటిక్‌గా ఆ స్టాప్‌లో డిజిటల్ డిస్ ప్లే లో టైమింగ్ మారుతుందట. ఒక్క నిమిషం అటూఇటూ కాకుండా సమయానికొచ్చింది బస్సు. మేము వెళ్లేది యూనివర్సిటి ప్రదేశానికి కాబట్టి సహప్రయాణికులంతా విద్యార్థులే ఉన్నారు. స్వీడన్‌లో విద్యా విధానం బాగుంటుంది. ఉచితం కూడా. జి.ఆర్.ఇ టోఫెల్ రాయకుండానే నేరుగా యూనివర్సిటీలోకి ప్రవేశం ఉంటుంది. అసలు ఐరోపా విద్యా వ్యవస్థలోని అద్భుత లక్షణం...యూనివర్సిటీలకు, పరిశ్రమలకు మధ్య అనుసంధానం. అంతే కాదు వీరు పర్యావరణానికి కూడా అధిక ప్రాధాన్యతనిస్తారు. అక్కడ ఎక్కువ మంది తమిళులు కనిపించారు. కానీ వారు మన దేశం వారుకాదు. శ్రీలంక తమిళియన్స్. అక్కడ స్థానిక సమస్యలతో ఎక్కువ మంది స్విట్జెర్లాండ్, స్వీడన్, నార్వే దేశాలు చాలా మంది తమిళియన్లకు ఆశ్రయం కల్పించాయి. ఆ తర్వాత వారికి ఆ దేశాల పౌరసత్వం కూడా వచ్చిందనుకోండి. అయితే ఇక్కడ మెట్రోపాలిటన్ నగరాలను మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లో జన సాంద్రత చ.కి.మీకు 20 మాత్రమే. 84శాతం మంది నగరాల్లోనే నివసిస్తారు. స్వీడన్ జనాభా మొత్తం 9 మిలియన్లు.   ఇక్కడ అద్దెలు చాలా ఖరీదు. విద్యార్థులకు మాత్రం ప్రభుత్వం రాయితీ కల్పిస్తుంది. శరవణన్ నివాసానికి చేరుకున్నాం. నేను యూరప్ వెళ్లిన ఆరునెలల తర్వాత ఒక తెలుగు వ్యక్తి



పరిచయమయ్యాడు. అతనితో మనసు్స విప్పి మాతృభాషలో మాట్లాడుతుంటే నా ఆనందానికి అవధుల్లేవు.

మరుసటి రోజు అందరం కలిసి నగరాన్ని చూడ్డానికి బయలుదేరాం. ఆ రోజు ఉష్ణోగ్రత 2 డిగ్రీలు చూపిస్తోంది. అసలే నవంబర్ నెల. ఇక స్వీడన్‌లో కార్లను కొనడం కన్నా వాటిని మెయిన్ టైన్ చేయడం చాలా ఖరీదు. ఫ్రీ పార్కింగ్ ఎక్కడా ఉండదు. ఆఖరికి ఆఫీసుల్లోకూడా. కాలుష్యాన్ని అరికట్టడానికి, ప్రజా రవాణావ్యవస్థను బలిష్ఠం చేసేందుకు ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకుంది. వోల్వో, ఎరిక్ సన్, బోఫోర్స్ లాంటి అంతర్జాతీయ కంపెనీలకు పుట్టినిల్లు స్వీడన్. బస్సులో వెళుతుంటే ఎరిక్సన్ కంపెనీ హెడ్ క్వార్టర్స్ కనిపించాయి. డైనమైట్‌ను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జన్మించింది ఈ నగరంలోనే. ఆయన పేరుమీదే నోబెల్ బహుమతి ఇస్తారు. అక్కడ డ్రట్టినోనైమ్ ప్యాలస్ కివెళ్లాం. అది ఒకప్పుడు స్వీడన్ రాజులు నివసించిన భవంతి. అక్కడ కట్టడాల్లో భారీతనం, యూరోపియన్ శైలి నన్నెంతగానో ఆకట్టుకున్నాయి.

స్వీడన్ నగరమంతా మధ్యలో సముద్రం వాటి మీద వంతెనలతో ఎంతో అందంగా ఉంటుంది. దగ్గరలో షిప్ మ్యూజియం ఉందని తెలియడంతో అది చూద్దామని బోటు ఎక్కి మ్యూజియానికి చేరుకున్నాం. ఆ మ్యూజియం పేరు వాసా ముసీట్(స్వీడన్ భాషలో మేసీట్ అంటే మ్యూజియం). 200 క్రోనాలు చెల్లించి నౌక మ్యూజియంలోకి ప్రవేశించాం. ఆ నౌక గురించి పలు ఆసక్తికరమైన విషయాలు అక్కడున్న గైడ్ వివరించింది. 1626లో స్వీడన్ రాజు అడాల్ఫ్ పోలాండ్ మీద యుద్ధం చేసేందుకు ఒక యుద్ధనౌకను నిర్మించాలని అనుకున్నాడట. దీనికోసం హెన్రీ అనే ఒక డచ్ ఇంజనీర్‌ని నియమించాడు. స్టాక్ హోం షిప్ యార్డులో ఈ నిర్మాణం పూర్తిచేసేందుకు ఏడాది పట్టిందట. దీనికిగాను టన్నుల కొద్దీ ఓక్ వృక్షాల కలపని ఉపయోగించారు. 1628 ఆగస్టు 10వ తేదిన వాసా నౌక పోలాండ్‌పై యుద్ధానికి బాల్టిక్ సముద్రపు జలాల్లోకి ప్రవేశించింది. కొన్ని వేల మంది స్వీడన్లు, మిగతా దేశాల అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు విచ్చేశారట. కాని అప్పుడే ఓ అనుకోని దురదృష్ట

సంఘటన జరిగిందట. నౌక బయలుదేరిన 20 నిమిషాల్లోనే నీట మునిగింది. కొన్ని వందల మంది జల సమాధి అయ్యారు. ఇది స్వీడన్‌కు కోలుకోలేని దెబ్బని మిగిల్చిందట ఈ సంఘటన.

సుమారు 333 ఏళ్ల తర్వాత 1950 సంవత్సరంలో స్వీడన్ ప్రభుత్వం ఈ వాసా ను బయటకు తీసేందుకు పూనుకుంది. అందుకు నేవి అధికారులు పెద్ద ఎత్తున ప్రణాళికలు రచించారు మొత్తంమీద 18 లిఫ్టుల సహాయంతో 1959 నాటికి సముద్రం అడుగు నుండి 32 మీటర్ల ఎత్తుకి ఈ షిప్‌ని లేపారు. అప్పటికే ఇనుమంతా తుప్పు పట్టిపోయిందట. అక్కడ నుండి మరో 16 మీటర్లు పైకి లేపితే ఈ నౌక సముద్రం ఉపరితలం మీదకు కనిపిస్తుంది. అందుకు మరో ఏడాదిన్నర పట్టిందట. అంతిమంగా 1961 ఏప్రిల్ 24న వాసా నౌక ప్రపంచానికి కనిపించింది. ఈ నౌకలో దాదాపు నలభై వేల వస్తువులు లభించాయట. విచిత్రమేంటంటే ఇన్నేళ్లయినా 85శాతం నౌక యథాతథంగానే ఉంది.

ఈ షిప్‌లో ఒక మిని థియేటర్ ఉంది. అందులో షిప్ చరిత్ర, దాన్ని బయటకు తీసిన నాటి దృశ్యాలు అన్నీ కలిపి ఓ 20 నిమిషాలపాటు ఒక డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారు. అంటే ఇప్పుడు ఆ నౌక వయసు్స 388 ఏళ్లు. అన్నేళ్ల ఆ షిప్‌ని చూస్తుంటే ఆశ్చర్యం వేసింది.

అక్కడ నుండి బయటకు రాగానే నోర్డికా ముసీట్ అనే మరో మ్యూజియం ఉంది. మాకు సమయం లేకపోవడంతో అక్కడ నుండి ట్రాము ఎక్కి పార్లమెంట్ భవనం చేరుకున్నాం. ఇది చాలా పెద్దది. తర్వాత స్వీడన్ సిటీ హాలు దగ్గరకు వెళ్లాం. లోపలకి ప్రవేశించగానే ఉత్సాహం ఉరకలు వేసింది. ఎందుకంటే చిన్నప్పటి నుండి నోబెల్ బహుమతి గురించి మాట్లాడేవాడ్ని, వినేవాడ్ని...కానీ ఆ నోబెల్ బహుమతి ప్రధానం చేసే హాలు అదే అని తెలిసేప్పటికి, అక్కడున్నామన్న ఊహే అద్భుతంగా అనిపించింది. తర్వాత పక్కనే ఉన్న ఒక ఇటాలియన్ రెస్టారెంట్‌లో పిజ్జా తిని తిరుగు ప్రయాణమయ్యాం.

- వేమూరి రాజేష్

నవ్వుల్ - పువ్వుల్



కనబడుటలేదు

సుబ్బారావు: నిన్నటి నుండీ మా ఆవిడ కనిపించడం లేదండీ..!

ఎస్సై: ఎక్కడికైనా వెళు_న్నట్టు చెప్పిందా??

సుబ్బారావు: ఊళ్లో వున్న చీరల షాపులన్నీ వెతికిస్తే కనిపిస్తోందేమో సార్!

ఏ షాప్?



డాక్టర్: నీ రెండు కిడ్నీలు పాడైపోయాయి. అర్జెంటుగా ఒకటయినా అమర్చాలి..!

పేషెంట్: అలాగే డాక్టర్ గారూ..కానీ కిడ్నీలు ఏ షాపులో అమ్ముతారు.

దారం



జైలు అధికారి: నీకు ఉరి ఖాయం అయింది. నీ ఆఖరి కోరిక ఏమైనా వుంటే చెప్పు..!

ముద్దాయి: వుంది గానీ, మీరు తీర్చలేరు..!

అధికారి: తీర్చగలను... చెప్పు..!

ముద్దాయి: ఉరిని తాడుతో కాకుండా దారంతో వేయండి..!

అప్పు

రాజేష్: రోజూ అప్పు అడగడానికి సిగ్గుగా లేదూ..!

రమేష్: పోనీ ఒకేసారి నా ఎకౌంట్‌లో పెద్ద మొత్తం వేసేయండి.. రోజూ అడగను..!

ఏ కుక్క?

రాజు: నిన్ను కుక్క కరిచిందా? ఏ కుక్క. పెంపుడు కుక్కా, వీధి కుక్కా?

తాజ్: వుండు దాన్ని అడిగొచ్చి చెప్తా.

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

ఆరోగ్యంగా... ఆనందంగా...

పాత ఏడాదికి వీడ్కోలు... కొత్త సంవత్సరానికి స్వాగతంతో ... శుభాకాంక్షలు చెప్పకున్నాం ఘనంగా. నూతన సంవత్సర వేడుకల సంబరాలను... సంతోష సమయాలను ... మర్చిపోకముందే... పదిహేను రోజులు గడిచిపోయాయి. ఈ ఏడాదంతా మరింత సంతోషంగా... ఆరోగ్యంగా వుండాలంటే.. తప్పనిసరిగా పాటించాల్సిన అంశాలు పది వున్నాయి.

పరిశుభ్రంగా...

వ్యక్తిగత పరిశుభ్రత ఎప్పుడూ అవసరమే. ఎప్పటికప్పుడు అలా వుందామని గా...ట్టిగా అనుకున్నా... బద్ధకిస్తుంటాం. లోదుస్తులు, సాక్సులు, చేతులు శుభ్రం చేసుకునే లోషన్లు, సబ్బులు...తప్పనిసరిగా వెంట వుండాలి. కొత్త లోదుస్తులు, సాక్సులు, టూత్ బ్రష్షులతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభిద్దాం.

కంటి నిండా నిద్ర

ఏవేవో టార్గెట్లతో నిత్యం సతమతమౌతుంటాం. సరిగా నిద్ర కూడా పట్టక తంటాలు పడుతుంటాం. నిజానికి చక్కటి నిద్ర విజయానికి సోపానం అని మర్చిపోతుంటాం. రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల సేపు నిద్రపోతే... మెదడు చురుగ్గా పని చేస్తుంది. చదువులోనైనా, పనిలోనైనా చక్కటి ఫలితాలు సాధించగలుగుతాం.

చిరునవ్వు చెరగనీకు

పనిలో డెడ్ లైన్లు వుంటాయి. ఇంట్లో పూర్తి చేయాల్సిన పనులెన్నో వుంటాయి. ఇవి కాక సహ విద్యార్థులు, ఉద్యోగుల ఒత్తిళ్లు. వీటన్నిటినీ సులభంగా పరిష్కరించుకోవాలంటే ఒక సుళువైన మార్గం వుంది. అదే చిరునవ్వు. నవ్వుతూ రోజు ప్రారంభించి చూడండి. నమ్మలేని ఫలితాలు సొంతమౌతాయి. కాస్మొటిక్ సర్జన్‌తో పనే వుండదు. మొహం మీది ముడతలు, వృద్ధాప్యపు జాడలే కానరావు. మరి నవ్వుతూ మొదలెడదామా రోజుని.

ఒక బ్రేక్ అవసరమే

ఎప్పుడూ పనీ...ఉరుకులు పరుగు లేనా! ఒక బ్రేక్ కూడా అవసరమే. ఎంచక్కా... సెలవు పెట్టేసి... కార్యాలయాలకు ఒత్తిళ్లకు దూరంగా సుదూరంగా ప్రకృతి ఒడిలోకి వెళ్లిపోవాలి. గుండెల నిండా స్వచ్ఛమైన గాలులను పీల్చుకుని ఆస్వాదించగలగాలి.

మంచి ఆహారం

'ఆరోగ్యంగా వుండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి' అని చెప్పామనుకోండి. 'బానే తింటున్నాం కదా' అనిపిస్తుంది ఎవరికైనా. బానే అంటే కడుపు నిండా ఏదిపడితే అది తినేయడం కాదు. పోషక పదార్థాలు తీసుకోవడం. ఒకేసారి పెద్దమొత్తంలో తినేయకుండా...కొద్ది కొద్దిగా ఎక్కువ సార్లు తినడం. నూనెలు, వేపుళ్ల తగ్గించి అన్ని రకాల కాయగూరలను, పోషకాహార పదార్థాలను తీసుకోవడం. అప్పుడే ఊబకాయం ఊసే లేని ఆరోగ్యం సొంతం చేసుకోగలుగుతాం.

అధిక తీపి అనర్థమే

తీపి తినడం మంచిదే. అయితే అతిగా తింటే అనర్థమేనంటే స్వీటు ప్రియులకు కోపం రావచ్చు. కానీ మన దేశంలో డయాబెటిక్ రోగులు 67 మిలియన్ల మంది వున్నారని చెప్తొకైనా ఆ విషయం నిజమేనని నమ్ముతారా! మెల్లగా ఆ సంఖ్య పెరుగుతోంది కూడా. కొత్త సంవత్సరంలో మన జీవితం తియ్యగా గడవాలంటే... తీపిని అతిగా తినడం తగ్గించుకోవాలి.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

ఆరోగ్యమే మహా భాగ్యం. అందుకే ఏ చిన్న సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకూడదు. కనీసం ప్రతి ఆరు మాసాలకొకసారి వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. దీనివల్ల అనారోగ్యం ప్రాథమిక దశలో వుండగానే పసిగట్టి జాగ్రత్త పడే అవకాశం వుంటుంది.

వ్యాయామం మరవొద్దు

ఎన్ని పనులైనా వుండనీయండి. వానలొచ్చినా వరద లొచ్చినా ఏమైనా సరే. రోజుకి కనీసం ఓ అరగంట సేపు వ్యాయామం చేయాలి. జిమ్ము కెళ్లే వాళ్లు ఎప్పుడూ ఎగనామం పెట్ట కూడదు. అన్నపానీయాలు తీసుకున్నంత... ప్రాణ వాయువు పీల్చుకున్నంత సహజంగా వ్యాయామం కూడా మన జీవితంలో ఒక భాగం కావాలి.

పొగ వదిలేద్దాం

ఇదో దురలవాటు. ప్రాణాలు తీసే అలవాటు. సిగరెట్ కాల్చేవారే కాక... వారి చుట్టు పక్కల వారు కూడా అనారోగ్యం పాలౌతారు. అందుకే పొగ తాగే అలవాటును వదిలేస్తే ... వారికే కాదు అందరికీ మంచిది.

'స్మార్ట్'కు కాసేపు దూరం

ఇప్పుడన్నీ స్మార్ట్ ఫోన్లే. ఎవరి చేతులో చూసినా కనిపిస్తోంది. ఇంక చుట్టూ ఏమైపోతున్నా పట్టించుకునే పనిలేదు. ఫోన్లోంచి తల తీసేదే లేదు. ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదు. అందుకే కనీసం రోజుకి ఓ గంటసేపైనా స్మార్ట్‌కి దూరంగా వుండడం శ్రేయస్కరం.

దేశాలు దాటిన దినుసులు

మసాలా దినుసులు దేశాలనే దాటాయంటే నమ్మబుద్ధి కాదు. వ్యాపార నిమిత్తం ఓడల్లో సుగంధ ద్రవ్యాలను, దినుసులను నింపుకొని వెళ్లేవారు. వాటిని అక్కడ అమ్ముకొని తిరిగి స్వదేశం చేరుకొనేవారు. అయితే పనిలో పనిగా అక్కడ లభించే దినుసులను తిరిగి ఓడల్లో నింపుకొచ్చేవారు. వాటిని ఇక్కడ అమ్మేవారు. అలా దినుసులు దేశాలనే కలిపాయి. అయితే దినుసులుఎంత ముఖ్యమో...ప్రాణాలకు తెగించి ఓడల్లో సరకు నింపుకొని ప్రయాణం చేసిన వారూ అంతే ముఖ్యం. వారే కనుక ఆ సాహసకృత్యాలు చేసి వుండకపోతే మనకు ఆయా దేశాలు...ఆయా దినుసులు తెలిసేవే కావు.

◆ అవి ఇవి

వెనిస్ నగరానికి చెందినవాడు మార్కోపోలో. ఈయన గొప్ప వ్యాపారి. ఈయనకు సాహసకృత్యాలంటే మహా ఇష్టం. 1271–95 మధ్య ఆయన ఆసియాకు ప్రయాణం కట్టాడు. పదిహేడేళ్లపాటు చైనాలో ఉన్నాడు. తన ప్రయాణం అనుభవాలతో ఆయన రాసిన పుస్తకం గొప్ప ఖ్యాతి సంపాదించి పెట్టింది. దాంతోపాటు డబ్బు కూడా వచ్చిపడిందనుకోండి.

ఎలిజబెత్ కాలానికి చెందినవాడు ఫ్రాన్సిస్ డ్రేక్. బ్రిటిష్ నావికుల్లో అత్యంత ప్రఖ్యాతుడు. 1577 నుంచి 1580 మధ్య ఆయన సముద్రంపై భూమిని చుట్టి వచ్చాడు. 1580లో సుగంధద్రవ్యాలతో నిండిన నౌకను ఆయన ప్లైమౌత్ హార్బర్‌లో ఆపినప్పుడు బ్రిటన్ డ్రేక్‌కు నీరాజనాలు పలికింది.

వాస్కోడిగామా పోర్చుగీసు నావికుడు. 1497 నుంచి 1524 వరకు మూడుసార్లు ఇండియా వచ్చి వెళ్ళాడు. గుడ్ హోప్‌ను చుట్టి ఇండియా తీరాన్ని మొదటిసారిగా తాకిన వాస్కోడిగామా యాత్ర పోర్చుగల్‌ను కొంతకాలం పాటు ప్రపంచశక్తిగా నిలపగలిగింది. నిజానికి వాస్కోడిగామా ప్రయాణం వలస పాలన ద్వారా ప్రపంచ చరిత్రనే మార్చి వేసింది.

ఫెర్డినాండ్ మాజిలాన్ (1480–1521) పోర్చుగీసు సాహసికుడు భూమిని చుట్టి వచ్చిన మొదటి ప్రయాణం మొదలు పెట్టి దక్షిణ అమెరికా ఖండాన్ని చుట్టి ముందుకు వెళ్ళాడు. పసిఫిక్ మహాసముద్రాన్ని దాటాడు. మాజిలాన్ జలసంధికి ఆయన వల్లనే ఆ పేరు వచ్చింది. ఫిలిప్పీన్ మజిలాన్ మరణించాడు. ఆయన నడిపించిన ఐదు నౌకల్లో ఒకటి డెల్కానో నాయకత్వంలో తిరిగి వచ్చింది.

క్రిస్టఫర్ కొలంబస్ (1451–1506)కు వచ్చినంత ఖ్యాతి ప్రపంచంలో ఏ అన్వేషకుడికీ రాలేదు. నూతన ప్రపంచం (అమెరికా) కనిపెట్టింది ఆయనే. అయితే కొలంబస్ అనుకున్నదొక్కటి జరిగింది. ఒకటి. ఈస్ట్ ఇండియా దీవులకు సముద్రమార్గం కనిపెట్టేందుకు బయలుదేరి అమెరికా తీరంలో తేలాడు. లక్ష్యం సాధించలేకపోయినా బోలెడు బంగారం, కొత్త రకాల సుగంధ ద్రవ్యాలు దొరికే ప్రాంతాలను కనిపెట్టాడు.

అల్లం. మనం వంటలో ఎక్కువగా వాడుతుంటాం. ఇది 'జింజిబర్ అఫీషియనల్ అమే' అనే మొక్క వేరంటే నమ్ముతారా! చైనా ఆగ్నేయ ప్రాంతం నుంచి క్రమంగా ఇది చాలా దేశాలకు విస్తరించింది. దీనిలో ఔషధ గుణాలు కూడా ఉన్నాయి.

చట్నీల్లో జీలకర్ర తగలకపోతే రుచించదు మనకు. జీలకర్రగా మనకు తెలిసిన 'రాదినునుక్యుమినం ఫైమినం' అనే చెట్టు విత్తనాలు. తూర్పు మధ్యధరా ప్రాంతం నుంచి ఇది వచ్చింది.

పానకం అనగానే మనకు స్ఫురించేవి మిరియాలు. వీటిని 'ఆల్‌స్పైను జమైగా' అని కూడా అంటారు. పిమెంటా డయోకా అనే చెట్ల కాయలే ఈ మసాలా దినుసు.

పిల్లలకు తలంటు పోయాలంటే సాంబ్రాణి కావాల్సిందే. మరి సాంబ్రాణి ధూపం వేస్తేనే కదా స్నానం పూర్తయినట్టు. 'బోస్వెల్లియాస్కారా' అనే చెట్టు ఒమన్ ఎడారి భూముల్లో మాత్రమే పెరిగేది. ఆ చెట్టు నుంచి వచ్చే బంకను ఎండబెడితే అదే సాంబ్రాణి.

దాల్చిన చెక్క పుట్టిల్లు శ్రీలంక. 'సిన్నమోనం శైలాంసియం' అనే చెట్టు బెరడు ఇది. ఒకప్పుడు యూరప్‌లో దానికి నమ్మశక్యంకాని ఎక్కువ ధర పలికేది.

క్రీ.పూ. 400 ప్రాంతంలో మిరియాలు వ్యాపారం మొదలయ్యేంత వరకూ యూరప్‌లో ఆవాలదే రాజ్యం. తెల్ల ఆవాలకు బాగా గిరాకీ ఉండడంతో మధ్యయుగం కాలంలో ఆవాలసాగు ఇండియా, చైనాలకు విస్తరించింది.

అతి మధురం (లికోరైస్) అనే ఈ ఔషధాన్ని 2000 ఏళ్ల క్రితం నుంచి ఇండియా, చైనా, యూరప్ దేశాల్లో వాడుతున్నారు. గ్లైసిరై జా గ్లాబ్రా అనే చెట్టు వేరు నుంచి దీనిని తీస్తారు.

◆

◆ సమ్‌థింగ్ స్పెషల్

తల్లిదండ్రులకు ఆశాభంగం

నూతన సంవత్సరాది రోజు జన్మించిన తొలి బిడ్డల పేర్లను ప్రకటించటం అమెరికాతో సహా కొన్ని దేశాల ఆసుపత్రులలో ఒక సాంప్రదాయం. అయితే ఈ సంవత్సరం దానికి అంతరాయం ఏర్పడింది. అలా ప్రకటించొద్దని కమ్యూనిటీ హెల్త్ సిస్టమ్స్ అనే సంస్థ తన 207 ఆసుపత్రులను ఆదేశించటంతో అనేక మందికి ఆశాభంగం కలిగింది. ఎందుకంటే పిల్లల అపహరణ, గుర్తింపును తారు మారు చేసే అవకాశం ఉందని చెప్పటంతో మిగతా ఆసుపత్రులు కూడా అదే బాట నడిచాయి. అయితే కొన్ని ఆసుపత్రులు మీడియాకు ధైర్యం చేసి సమాచార మిచ్చినప్పటికీ మొత్తం మీద మీడియా, రావాల్సిన కానుకలు రానందుకు అత్యధిక తలితండ్రులు ఆశాభంగం చెందారు.

1983-2014 మధ్య 293 పిల్లలు అపహరణకు గురయ్యారని డిసెంబరులో ఎన్‌సిఎంఇసి అనే సంస్థ వెల్లడించింది.వారిలో 12 మంది ఆచూకీ ఇంతవరకు తెలియలేదు. సెలవుల సమయంలో అపహరణలు పెరిగే అవకాశం ఉందని కూడా హెచ్చరించింది. ఈ నివేదికను ఆధారం చేసుకొని బాప్టిస్టు హెల్త్ మరియు జాక్సన్ ఆసుపత్రి సంస్థ పేర్లు వెల్లడి చేయటాన్ని నిషేధించింది. తలిదండ్రులతో ఇంటర్వ్యూ చేయటాన్ని, పిల్లల ఫొటోలు తీయటానికి మీడియా సిబ్బందిని అనుమతించరాదని కొత్త విధానాన్ని తీసుకున్నట్లు తెలిపింది. దాంతో ఎవరైనా తలిదండ్రులకు ఆసక్తి ఉంటే మీడియాకు సమాచారం ఇచ్చే నిర్ణయాన్ని వారే తీసుకోవాల్సి వచ్చింది.

పేర్లు వెల్లడించవద్దని తాము సూచించలేదని, గతంలో జరిగినదాని గురించి కేవలం హెచ్చరిక మాత్రమే చేశామని ఎన్‌సిఎంయిసి సంస్థ వివరణ ఇచ్చింది. పిల్లల వివరాలు వెల్లడించకుండా ఉండాలని, తలిదండ్రుల చిరునామాలు, ఇతర గుర్తింపును బహిర్గతం చేయకూడదని, ఫొటోలు ప్రచురించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాత్రమే తాము సలహా ఇచ్చామని పేర్కొన్నది. నూతన సంవత్సరంలో తొలి బిడ్డ జన్మించటం ఎంతో సంతోషకరమైన విషయమని, ఆసక్తి కరంగా ఉంటుందని మాకు తెలుసు, అయినప్పటికీ మా తొలి కర్తవ్యం పిల్లల భద్రత, తలిదండ్రుల గోప్యత కాపాడటం అయినందున ముందు జాగ్రత్త కోసం పేర్లు తెలపటం లేదని పలు సంస్థలు తెలిపాయి.

అయితే సంవత్సరాది తొలి బిడ్డ పేర్లు ప్రకటించ వద్దని పది సంవత్సరాల క్రితమే ఆసుపత్రులకు గుర్తింపు నిచ్చే ఒక కమిటీ సలహా ఇచ్చింది. అయితే ఆసుపత్రులే నష్టభయాన్ని అంచనా వేసుకొని నిర్ణయం తీసుకోవాలని కమిటీ ప్రతినిధి తాజా పరిణామంపై వ్యాఖ్యానించారు. న్యూయార్క్ ఆసుపత్రుల సంస్థ మాత్రం తలిదండ్రుల అనుమతి తీసుకొని పేర్లు, ఫొటోలను వెల్లడిస్తున్నది. తలిదండ్రులు అభ్యంతర పెడితే వివరాలు గోప్యంగా ఉంచుతున్నది.

అమెరికాలోని కొన్ని రాష్ట్రాలలో పుట్టిన తేదీ తెలుసుకోవటంపై 125 ఏళ్లుగా కొన్ని ఆంక్షలు ఉన్నాయి. అలాంటి వాటిలో అలబామా ఒకటి. గతేడాది నూతన సంవత్సరాది రోజున ఆ రాష్ట్రంలో 56,887 మంది పుట్టారు. నూతన సంవత్సరాది రోజున పుట్టే పిల్లల గురించి సంచలనాత్మకంగా సమాచారం ఇవ్వటంలో మీడియా పోటీ పడుతుంటుంది. చికాగో శివార్లలోని గుడ్ షెప్పర్డ్ అనే ఆసుపత్రి ఈ ఏడాది 12.01 నిమిషానికి తమ ఆసుపత్రిలో ఇద్దరు బిడ్డలు పుట్టినట్లు ప్రకటించింది. ఇలా ముందుగా పుట్టిన పిల్లలకు అనేక బహుమతులు, రాయితీలు కూడా ఇస్తుంటారు. తలిదండ్రులు, పిల్లలు జీవితాంతం ఆ మహత్తర ఘటన గురించి చెప్పుకుంటారు.

నూతన సంవత్సరాది రోజు పుట్టిన వారి పేర్లు వెల్లడించటం అసలు ఎప్పుడు ప్రారంభమైంది? దీనికి ఫలానా సంవత్సరం అని చెప్పటానికి ఆధారాలు లేవు. అయితే జనవరి ఒకటి నూతన సంవత్సరాది ఎప్పుడు ప్రారంభమైందో అప్పటి నుంచి ఇది ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్రపంచంలో అనేక కాలండర్లు ఉన్నాయి. చరిత్రలో అనేక మంది చెప్పినదాని ప్రకారం మెసపుటేమియా అంటే నేటి ఇరాక్‌లో క్రీస్తు పూర్వం రెండు వేల సంవత్సరాల నాడు నూతన సంవత్సరం ప్రారంభమైంది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క కాలండరు, నూతన సంవత్సరాదులు భిన్నంగా ఉన్నాయి. జనవరి ఒకటవ తేదీ నూతన సంవత్సరాది సాంప్రదాయానికి వస్తే 1582లో పోప్ 13వ గ్రెగరీ ప్రవేశపెట్టారు. అంతకు ముందు జులియన్ కాలెండర్ అమలులో ఉంది. దానిలో ఉన్న లోపాలను సరిదిద్ది కొత్త కాలండర్‌ను గ్రెగరీ ప్రారంభించారు కనుక దానికా పేరు వచ్చింది. అయితే దీనిని తూర్పు ఐరోపాలో చర్చ్‌లు దీనిని చాలా కాలం అంగీకరించలేదు. 1929లో గ్రీస్, సోవియట్ యూనియన్ చివరిగా ఆమోదించాయి. దాంతో క్రీస్తు పూర్వం 46 వ సంవత్సరం నుంచి ఉనికిలో ఉన్న జూలియన్ కాలండర్ శకం ముగిసింది. దీని ప్రకారం ఒక సంవత్సరంలో 365.25 రోజులుంటాయి. అదే గ్రెగరియన్ కాలండర్‌లో 365.2425 రోజులు అంటే తేడా 0.002శాతం ఉంది.

-సత్య

గ్రహణం పట్టింది

ఆకలి వరద కలవర పెడుతున్నపుడు
కరకట్టలపై నా కాళ్ళు తిరుగాడేవి
దు:ఖం పెల్లుబికినపుడు
నా కళ్ళకు నది స్నానం చేయించేది
సూర్యాస్తమయాన్ని నదిలో చూస్తుంటే
మేఘాల నేపథ్యం ముచ్చట గొలిపేది
అలసట చెందిన మనసు చెట్టు కింద సేద తీరితే
పరుగెత్తుకుంటూ వచ్చిన మలయమారుతం
వింజామరలు విసిరేది
నది నవ్వుతూ నీకేమివ్వగలనంటూ
వొడ్డున కాసిన గడ్డిపూలు కోసి యిచ్చేది
రాతిని ఢీ కొట్టి లేచిన కెరటాన్ని
బంధించిన దోసిలి నాగొంతు నింపేది
ఆరోజు ప్రాత:సంధ్యలో నదికి చేరాను
కరకట్టలు కనుమరుగయ్యాయి
ఎవరు మింగేసింది?
మనసు ఆహ్లాదం మరిచినప్పుడు
సముద్ర తీరాన విహరించడం అలవాటు
ఎన్ని రకాల భాషలు ఎన్ని రకాల రూపులు
ఎన్ని రకాల నడకలు ఎన్ని రకాల వృత్తులు
నడిచే కాళ్లు నలగకుండా
మెత్తటి ఇసుక పాదాల కింద పరిచేది
సముద్రం సూర్యుణ్ణి ప్రసవిస్తున్నప్పుడు
అలలు స్వాగతిస్తూ కేరింతలు కొట్టేవి
పాదాల కింద ఇసుకను లాక్కుంటూ
జీవితంలో ఎలా నిలబడాలో సముద్రం నేర్పేది
గుర్రాలపై అద్దె షికార్లు చేస్తున్న వాళ్ల ఠీవి
రారాజుల్ని మరపించేది
ఇస్‌క్రీం పిల్లల నోట్లో కరుగుతుంటే
ముఖం అష్టవంకర్లు తిరిగేది
ఆరోజు సాయం సంధ్యలో సముద్రం చేరాను
చెలియలి కట్ట మాయమై వుంది
ఎవరు అపహరించింది?
రోజూ చందమామతో జతకట్టే వాణ్ణి
పచ్చటి పొలాల మధ్య నడుస్తూ
ఎడారిలో ఇసుక దిబ్బల మధ్య పరుగెడుతూ
తొట్లో తేలాడే చంద్రుణ్ణి పట్టి ఆడుకుంటూ
ఆకాశ దారుల వెంట నడిచేవాణ్ణి
అడవి కాసిన వెన్నెల్ని అనుభవిస్తూ
ఆనంద కేళీ తరంగాల మధ్య ఆడుకునేవాణ్ణి
చంద్రుడు నేనై నేనను చంద్రుడై
పర్యాపదమయ్యేవాళ్లం
ఆ రోజు రాత్రి చంద్రుడు మాయమయ్యాడు
ఎవరు దొంగిలించింది?
మర్నాడు నిద్ర లేచాను
కారు చీకటి కమ్ముకుంది
ఎవరు భూగోళాన్ని కబళించింది?

-అడిగోపుల వెంకటరత్నం

చికిత్స

సోదరిపై అత్యాచారానికి అది అడ్డు కానే కాదు
బాబూ అని వేడుకున్నా కరుణించ లేదు
త్రాష్టులకు వావి వరస లెక్క లేనే లేదు
ఇక ఎవరికి కావాలి ఆ అతివ ఆర్తనాదం
ఏ చెవిని సోకింది ఆమె ఆక్రోశం
ఎన్ని చట్టాలైనా మట్టిలో కొట్టుకోవలసిందే
శిక్షలెన్నయినా వివక్ష కొనసాగవలసిందే
మగువ జీవితం అడుగడుగునా దుర్భరం
జీవన యానం భయం భయం భయం
భావోద్వేగాలు అంచనాకు అందకపోయినా
మత్తుని చిత్తు చేసే యంత్రాంగమే లేదా?
అంతర్జాలంలో అశ్లీలాన్ని నియంత్రించే
సాధనమే కరువా?
నిద్రలో జోగుతున్న రక్షణ పార్శ్వానికి చైతన్యం
కలగదా?
మూలాలను స్పృసిస్తేనే సమస్యకు పరిష్కారం
లక్షణాలనెరిగి చికిత్స చేస్తేనే రోగం
మాయమయ్యే ఆస్కారం
పైశాచికం పరవళ్లు తొక్కిన వేళ పాశవిక నైజం
ప్రజ్వరిల్లింది
నరుడి నరాల్లో ఉన్మాదం పెల్లుబికి అమానుషం
వైపు అడుగులు వేస్తోంది
ప్రకృతి వికృత దిశలో పయనిస్తూ
పంచభూతాల సాక్షిగా వంచన పర్వం
రసస్ఫోరకమౌతూ మంచికి మానవత్వానికి
మంగళం పాడింది
దురహంకారపూరిత మవుతున్నాడు
దుశ్శాసనుడు
ఈ మృగాడు తనను మించి పోతున్నాడని
మత్సరంతో మగ్గుతున్నాడు కీచకుడు
ఈ కాముకుడు తనతో పోటీ పడుతున్నాడని!
ఇది నిర్భయుల దేశం, నిర్భాగ్యుల దేశం
ఇది అభయుల దేశం, అభాగ్యుల దేశం
అన్నా అని పిలిచినా చలనం లేనే లేదు

-వి.వి. కూర్మారావు

కథా నాయకుని కథ

నందమూరి తారక రామారావు... ముచ్చటగా ఎన్టీయార్... ఆ పేరు తెలుగు వారి గుండెలపై చెరగని చేవ్రాలు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా, ఆపై ప్రజా జీవితంలో జనహృదయ విజేతగా ఆయనది ఒక విలక్షణ ప్రస్థానం. సైకిలుకు బిందె కట్టుకొని, కిలోమీటర్లు ప్రయాణించి పాలు అమ్మిన సామాన్య రైతు కుటుంబంలోని యువకుడు జనసామాన్యాన్ని ఉర్రూతలూపి, వెండితెర వేల్పుగా మారిన వైనం ఆశ్చర్యకరం. కృషి, పట్టుదల, ఏకాగ్రతలతో శ్రమిస్తే మామూలు స్థాయి మనిషే మహోన్నతుడిగా ఎదుగుతాడనడానికి ఎన్టీయార్ మన కళ్ళెదుటి ఉదాహరణ. భౌతికంగా ఆయన కనుమరుగై సరిగ్గా ఇవాల్టితో 19 ఏళ్లు నిండుతున్న సందర్భంగా ఈ వెండితెర జగదేకవీరుని సినీ జీవితంలోని కొన్ని కోణాలపై ఫోకస్... ఈ వారం కవర్‌స్టోరీ.

"నటన అనేది కేవలం ఒక వ్యాపకం కాదు. ఇదొక విధమైన తపస్సు!"

- నందమూరి తారక రామారావు, నటుడు - దర్శక, నిర్మాత.

సినిమా కళ, వ్యాపారమా అని తెలుగుతెర గురించి చర్చ జరుగుతున్న తొలి రోజుల్లోనే ఇది ఎన్టీయార్ స్థిరాభిప్రాయం. ఆయన సినీ జీవితాన్ని జాగ్రత్తగా గమనిస్తే, మొదటి నుంచి చివరి వరకు ఆయనను నడిపిన మూలసూత్రం ఇదేనని అర్థమవుతుంది. తొలి చిత్రం 'మన దేశం' (విడుదల - 1949 నవంబర్ 24) నుంచి చివరి సినిమా 'శ్రీనాథ కవి సార్వభౌముడు' (1993 అక్టోబర్ 21) వరకు నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా సినిమా రూపకల్పన ఆయన ఒక యజ్ఞంగానే భావించినట్లు కనిపిస్తుంది.

అభినయంలో... 'విశ్వరూపం'

తొలిరోజుల్లో సాంఘిక కథాంశాల హీరోగా మొదలైన ఎన్టీయార్ విడుదలైన ఏడో చిత్రం 'పాతాళ భైరవి' (1951)తోనే ఒక్కసారిగా స్టారయ్యారు. ఆ వెంటనే వచ్చిన 'మల్లీశ్వరి', 'పెళ్లి చేసి చూడు' లాంటి చిత్రాలు ఆయన స్థానాన్ని సుస్థిరం చేశాయి. జానపదాలు, సాంఘికాలు చేస్తూనే, పౌరాణిక

జయ

చిత్రం 'మాయాబజార్' (1957)తో ఒక్కసారిగా అపర శ్రీకృష్ణుడిగా ప్రేక్షకుల అభిమానం కొల్లగొట్టారు. అక్కడ నుంచి ఏకాలంలో విభిన్న కోవల చిత్రాల్లోని పాత్రలకు సరిపడే నటుడిగా ఎన్టీయార్ కెరీర్ ఊపందుకుంది.

అప్పటి నుంచి 1970ల వరకు సినీ నటుడిగా ఆయన ఎదురు లేకుండా సాగారు. అక్కినేని నాగేశ్వరరావు, ఎస్వీ రంగారావు లాంటి దిగ్గజాలున్నా, గుమ్మడి, జగ్గయ్య లాంటి అభినయంలో దిట్టలున్నా ఎన్టీయార్ నిండైన విగ్రహం, ఏ పాత్ర చేసినా ఆంగికం, ఆహార్యం, వాచికాల్లో ఆయన సమ్మోహన శక్తి బాగా కలిసొచ్చాయి. అందుకే, శ్రీకృష్ణదేవరాయలైనా, శ్రీరాముడైనా, శ్రీవేంకటేశ్వరుడైనా, పుండరీకుడైనా అచ్చం ఇలాగే ఉంటాడు కామోసనుకున్నారు జనం. తెలుగుతో పాటు తమిళంలోనూ కె. సోము దర్శకత్వంలో 'సంపూర్ణ రామాయణం', బి.ఆర్. పంతులు దర్శకత్వంలో శివాజీ గణేశన్ నటించిన 'కర్ణ' ఆయనకు దక్షిణాది అంతటా ఆరాధకులను సంపాదించి పెట్టాయి. అలాగే, హిందీలో 'పాతాళభైరవి',

‘చండీరాణి’, ‘నయా ఆద్మీ’, ‘బ్రహ్మర్షి (విశ్వామిత్ర)’ చిత్రాలతో మెప్పించారు.

ఇమేజ్ చట్రంలో... ‘చిక్కడు - దొరకడు’

అయితే, అదే సమయంలో ఆ ఇమేజ్ చట్రంలోనే ఇరుక్కుపోకుండా ఉండేందుకు ప్రయోగాలు చేశారు. నటుడిగా తనలోని కళాతృష్ణను తీర్చుకోవడానికీ, పురాణేతిహాసాల్లో చెడ్డగా చెప్పుకుంటున్న పాత్రల్లోనూ దాగున్న మంచితనం, మానసిక సంఘర్షణల్ని తెరపై చూపడానికీ సాహసించారు. రావణాసురుణ్ణి రావణబ్రహ్మగా (‘సీతారామ కల్యాణం’), కురుసార్వభౌముణ్ణి సుయోధనుడిగా (‘శ్రీకృష్ణ పాండవీయం’), కర్ణుణ్ణి దానవీరశూరుడిగా (‘దాన వీర శూర కర్ణ’) సెల్యులాయిడ్‌పై ఆవిష్కరించారు. అలాగే, హీరో కృష్ణ, శోభన్‌బాబుల తరం వచ్చి, ఏయన్నార్ పాటలు, డ్యాన్సులతో అదరగొడుతున్న సమయంలో కమర్షియల్ సాంఘిక చిత్రాల్లోనూ కొత్త ఒరవడి తెచ్చారు. ‘అడవి రాముడు’ (1977) మొదలు మళ్ళీ రాజకీయాల్లోకి వెళ్ళే వరకు మాస్ మెచ్చే చిత్రాలతో బాక్సాఫీస్ వసూళ్ళలో రారాజుగా నిలిచారు.

ఏకకాలంలో కృష్ణుడిగా, సుయోధనుడిగా, కర్ణుడిగా ఎన్టీయార్ త్రిపాత్రాభినయం చేసిన ‘దాన వీర శూర కర్ణ’ (1977), ఏకంగా అయిదు పాత్రలు (శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, కీచకుడు, అర్జునుడు, బృహన్నల) ధరించిన ‘శ్రీమద్విరాటపర్వం’ (1979) సినీ నటనా చరిత్రలో వినూత్న సాహసాలే. పైగా రెండు చిత్రాలూ స్వీయ నిర్మాణ, దర్శకత్వంలోవే కావడం ఎన్టీయార్ పట్టుదలకు ప్రతీక. కళాకారుడిగా తనలోని దాహార్తిని తీర్చుకొనేందుకు ఆయన చేసిన ఇలాంటి ప్రయోగాలు, సాహసాలు తన సొంత సొమ్ము లక్షలు వెచ్చించి చేసినవే కావడం సినీ వ్యాపారంలో అరుదుగా కనిపించే లక్షణం.

శ్రీదేవితో వానపాట

సాంఘిక హీరో....

ఎన్టీఆర్ అనగానే పౌరాణిక పాత్రలు గుర్తుకు వస్తాయంటే అనితర సాధ్యంగా ఆయన నటించిన తీరే కారణం. ఆ విషయంలో ఆయనది ప్రపంచ రికార్డు అనొచ్చు. అయితే సాంఘిక చిత్రాల్లో సాధించిన విజయాలు కూడా వాటికి ఏ మాత్రం తీసిపోవు. వాస్తవానికి మొత్తం మీద చూస్తే ఆ భాగం ఎక్కువే. అందులోనూ ప్రజాసమస్యలపై పోరాడే పాత్రల్లోనూ కుటుంబ సంబంధాలను రక్తికట్టించడంలోనూ ఎన్టీఆర్ గొప్ప విజయాలు సాధించారు. ఆత్మబంధువులో సావిత్రి ఎస్వీఆర్‌లకు దీటుగా అమాయకుడైన హీరో పాత్రలో కంటతడి పెట్టిస్తాడు. ‘రక్త సంబంధం’లో సావిత్రి ఎన్టీఆర్‌లే అన్నచెల్లెల్లుగా నటించి ఒక కొత్త ఫార్ములాకు పునాది వేశారు. తర్వాత ‘ఆడపడుచు, చిట్టిచెల్లెలు వంటి చిత్రాలకు కూడా ఎన్టీఆర్ ప్రాణం పోశారు. తమిళం నుంచి రీమేక్ చేసిన గుడిగంటలులో ఆయన నటన ఒక గొప్ప జ్ఞాపకం. కమ్యూనిస్టులు సినిమా రంగంలో ప్రవేశించాక చేసిన తొలి ప్రయత్నం పల్లెటూరులో యువజన సంఘాల నాయకుడు ఎన్టీఆరే! ‘కథానాయకుడు, పెత్తందార్లు, రైతుబిడ్డ, దేశోద్ధారకులు...’ తదితర చిత్రాల్లో ఆయన మోసకారి నాయకులను నిలదీస్తుంటే ప్రజలు కేరింతలు కొట్టేవారు (ఈ లక్షణమే ఆయన జానపద పాత్రల్లోనూ వుండేది). ప్రేమకథల స్పెషలిస్టు అక్కినేని అయినప్పటికీ ఎన్టీఆర్‌కు కూడా ఆ తరహా విజయాలు అనేకం వున్నాయి. ఇక 1970లలో ‘ఎదురులేని మనిషి’, 1977లో ‘అడవి రాముడు’ చిత్రాల తర్వాత ఎన్టీఆర్ మరోసారి తారపథం అనుభవించగలిగారు. దాంతో పోలిస్తే అక్కినేని చాలా చిత్రాల్లో నటించి కొన్ని విజయాలు సాధించినా ఒక్క ‘ప్రేమాభిషేకం’లోనే ఆ స్థాయి విజయం అందుకున్నారని చెప్పాలి. ముఖ్యమంత్రిగా వుంటూ తీసిన ‘బ్రహ్మర్షి విశ్వామిత్ర’, తర్వాత వచ్చిన ‘అశోక, శ్రీనాథ’ వంటివి నిరాశపర్చినా మోహన్ బాబు కోసం చేసిన ‘మేజర్ చంద్రకాంత్’ ఆయనను విజయవంతమైన కథానాయకుడుగా చేసింది. ఆ చిత్రం విజయోత్సవంలో లక్ష్మీ పార్వతితో పెళ్లిని ప్రకటించడం వంటివన్నీ మరో కథ

అలవాట్లలో అచ్చమైన...

‘రైతుబిడ్డ’

రాత్రి తొందరగా పడుకొని, పొద్దున్నే తొందరగా లేవడం ఆయనకు చిన్నప్పటి నుంచి అలవాటు. తెల్లవారు జామున రెండున్నర, మూడు గంటలకే లేచి, కాలకృత్యాలు, వ్యాయామం, పూజాదికాలన్నీ పూర్తి చేసుకొని, భోజనం పూర్తి చేసి, అయిదుగంటల కల్లా తయారైపోయేవారు. పౌరాణిక పాత్రపోషణ సమయంలో ఆహార విహారాల్లో మరింత జాగ్రత్తలు పాటించేవారు. అలా తెల్లవారు జామునే షూటింగ్‌కూ, లేదంటే ఇతర కార్యకలాపాలకూ సిద్ధంగా ఉండడమనే నిత్యకృత్యాన్ని రాజకీయాల్లోకి వచ్చాక కూడా ఆయన అనుసరించారు. అలాగే, అన్నీ అందుబాటులోనే ఉన్నా, ఆయన ఎక్కడా కటుఎ తప్పలేదు. దుర్వ్యసనాల జోలికి పోలేదు. వ్యక్తిగత వ్యవహారాలను వృత్తిలోకి తీసుకువచ్చేవారు కాదు. ఆ వ్యక్తిత్వం, వ్యవహారశైలి, నిద్ర, ఆహారపుటలవాట్లు ఇవాళ్టికీ విలక్షణమే!

క్రమశిక్షణలో... ‘టైగర్’

ఎన్టీయార్‌కు తాను చేసే పనే దైవం. క్రమశిక్షణ, సమయపాలన, క్షణమైనా వృథా చేయకపోవడం - ఆయన స్వభావం. జీవితంలో ఆవేశం, ఉద్రేకం, తాను నమ్మిన సిద్ధాంతం కరెక్టని బలంగా భావించే తత్త్వం - ఇవన్నీ ఆయనకు పుటుఎకతో వచ్చిన గుణాలు. సినీ రంగంలో, రాజకీయ జీవితంలో ఆయన ఎదుగుదలకు ఉత్ప్రేరకాలయ్యాయి. షూటింగ్ సమయంలో ఆయనకు ఆ ధ్యాస తప్ప, మరో వ్యాపకం ఉండేది కాదు. అనవసరంగా మాట్లాడుతూ కూర్చొనేవారు కాదు. అందుకే, ఆయన షూటింగ్‌లో ఉంటే చాలు... అందరూ పని మీదే దృష్టి పెట్టడంతో షూటింగ్ చకచకా జరుగుతుందని నిర్మాతలు, దర్శకులు అనేవారు. పాత్ర పోషణ సమయంలో ఆ మూడ్‌లోనే ఉండేవారు. స్వీయ దర్శకత్వంలోని సినిమాల విషయానికి వస్తే, ఆర్టిస్టులకు కథ చెప్పేవారు కాదు. పూర్తి స్క్రిప్ట్ చేతికిచ్చి, చదువుకోమనేవారు. దానివల్ల వారికి పాత్ర స్వరూప స్వభావాలు, సన్నివేశం మీద పూర్తి అవగాహన కలుగుతుందని నమ్మేవారు. అదే సమయంలో, “...సెట్స్ మీదకు వచ్చిన తరువాత ఇతర విషయాల గురించి ఆలోచన కానీ జరిగితే సహించను. ఎంత ముఖ్యమైన విషయాలైనా సెట్ బయటే! సెట్ మీదకు వెళ్ళాక కేవలం నటన గురించి, పాత్ర స్వభావం గురించి మాత్రమే ఆలోచించాలి” అని ఆయనే స్వయంగా ఒకసారి చెప్పారు. ఇప్పటికీ తెలుగు సినీరంగంలో సెట్స్‌పై ఎన్టీయార్ క్రమశిక్షణ గురించి కథలు, కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. ఆయన ఆదర్శమని అందరూ చెబుతుంటారు.



చిత్ర నిర్మాణంలో... 'సాహసవంతుడు'!

నిజానికి, సినీ రంగంలోకి వచ్చిన కొద్ది సంవత్సరాలకే ఎన్టీయార్ చిత్ర నిర్మాణంలోకి దిగారు. 'ఎన్.ఏ.టి' పతాకంపై ఆయన నిర్మించిన తొలి రెండు చిత్రాలూ ('పిచ్చి పుల్లయ్య', 'తోడుదొంగలు') అభిరుచితో తెరకెక్కించిన ఆలోచనాత్మక ఇతివృత్తాలే. అయితే, అవి కాసులు తేకపోవడంతో, బాణీ మార్చి వాణిజ్య తరహా చిత్రాల వైపు మళ్ళారు. అయితే, అదే సమయంలో తన పేరుతో నిర్మించిన ప్రతి సినిమాలో ఒక సందేశం ఉండేలా చూసుకున్నారు. అలా ఆయన నిర్మించిన 8 సినిమాలూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు అందుకోవడం నిర్మాతగా ఎన్టీయార్ సాధించిన అరుదైన రికార్డు.

ఇక, లేటు వయసులో కూడా పాత్ర, స్క్రిప్టు బాగుంటే లాభాల ప్రమేయం లేకుండా సొంత డబ్బుతో సినిమాలు తీశారు. 'సమ్రాట్ అశోక' అందుకు ఒక ఉదాహరణ. ఇక, బాపు –రమణలు వద్దని వారిస్తున్నా తెలుగు కవి సార్వభౌముడి పాత్ర మీద మక్కువ తీర్చుకోవడానికి చేసిన 'శ్రీనాథ కవి సార్వభౌముడు' తెలుగు సాహిత్యం, సంస్కృతి మీద ఎన్టీయార్ ప్రేమకు తార్కాణం. ఈ క్రమంలో ఆర్థికంగా కోట్ల రూపాయలు నష్టపోయినా, కళాభిమానుల ప్రశంసలు, కళాకారుడిగా ఆత్మ తృప్తి లభించాయి లెమ్మని సంతోషపడ్డారు.

నిర్దేశకత్వంలో... 'బడిపంతులు'

దర్శకుడిగా ఎన్టీయార్ ప్రయాణం చాలా ఆసక్తికరంగా మొదలైంది. సినీ రంగానికి వచ్చి, దాదాపు పుష్కరకాలం అవుతుండగా, అప్పటికే కొన్ని పదుల చిత్రాల్లో పాత్రలు పోషించిన ఆయనకు "... నేను నటించిన ప్రతి చిత్రమూ నా సృష్టి కాదు. ఒక నిర్మాత, ఒక దర్శకుడు, ఎందరో సాంకేతిక నిపుణులు, కళాకారులు సమష్టిగా తయారు చేసిన ఒక చిత్రాన్ని అది ఎంత ప్రజాదరణ పొందినా, 'నాది' అని చెప్పుకోలేను..." అనే భావన కలిగింది. "ఏ చిత్రానికైనా సృష్టికర్త దర్శకుడే కదా! అందువల్లే దర్శకత్వానికి ఉపక్రమించాను" అని ఆయనే ఒకసారి చెప్పారు. పెద్దా చిన్నా అంతా మెచ్చే చిత్రాన్ని రూపొందించాలనీ, తన తల్లితండ్రుల పాదాల చెంత తనయుని చిన్న కానుకగా సమర్పించాలనీ నిర్ణయించుకున్నారు. అలా ఆయన 'సీతారామ కల్యాణం' (1961)తో దర్శకుడయ్యారు. అందుకే, ఆయన దర్శకత్వంలోని అప్పటి చిత్రాలన్నిటిలో సినిమా ప్రారంభంలోనే తానూ, తమ్ముడు త్రివిక్రమరావు కలసి తల్లితండ్రులకు నమస్కరించే దృశ్యం బ్లాక్ అండ్ వైట్‌లో కనిపిస్తుంటుంది.

పౌరాణికం, జానపదం, చారిత్రకం, సాంఘికం – ఇలా నాలుగు కోవల చిత్రాలూ నిర్మించి, దర్శకత్వం వహించి, కథానాయక పాత్రలు పోషించడం ఎన్టీయార్ కళాతృష్ణకు ప్రతీక. పైగా దర్శకుడిగా ఈ నాలుగు కోవల్లోనూ శతదినోత్సవ చిత్రాలు (మచ్చుకి 'శ్రీమద్విరాట్ వీర బ్రహ్మేంద్ర స్వామి చరిత్ర', 'వరకట్నం') తీసిన ఏకైక తెలుగు దర్శకుడు ఆయన. ఎన్టీయార్‌కు సమకాలికుడైన అగ్ర


ఘంటసాల,అక్కినేనితో...

'గుండమ్మ కథ'లో...

సినిమా అంటే... 'మేలుకొలుపు'

సినిమా మాధ్యమం గురించి ఎన్టీయార్‌కు కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు, నిర్దిష్టమైన ఆలోచనలు ఉండేవి. సినిమాను కేవలం వ్యాపారంగా భావించని తరానికి ఆయన ఓ ప్రతీక. ఆయన మాటల్లోనే చెప్పాలంటే, "...సినిమా అన్నది ఎంతో విలువైన సాధనం. దేశంలో నిరక్షరాస్యత వికటాట్టహాసం చేస్తున్న ఈ రోజుల్లో సినిమాల ద్వారా సామాన్య ప్రజానీకం తెలుసుకోగలిగేవి, తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. అందువల్లనే నేను ఎన్నుకొనే ప్రతి కథకూ ఏదో ఒక పరమార్థం ఉండాలని నా భావన. నా చిత్రం ద్వారా ప్రతి ప్రేక్షకుడూ తనకూ, తన చుట్టూ ఉన్న ప్రపంచానికీ ప్రయోజనకరమైన ఒక ప్రాపంచిక నీతిని తెలుసుకోవాలని నా సంకల్పం. ఉత్తమ చిత్రాలు ఈనాటి భారతావనికి పెట్టనికోటలు. మానవునిలో నీతిని పెంపొందింప జేయడానికి ఇవి ఉత్తమ సాధనాలు. అందువల్లనే మన చిత్రాల్లో దేశభక్తి, జాతీయ భావం నిండి ఉండాలి...." నలభై ఏళ్ల పైచిలుకు క్రితం ఆయన వ్యక్తం చేసిన మాటలు ఇవాళ్టికీ సరిపోయేలా ఉండడం విశేషం.

మూడు రకాల పెన్నులతో స్క్రిప్టు 'దీక్ష'

ఎన్టీయార్‌ది అందమైన చేతి రాత. సినిమాలను స్వయంగా దర్శకత్వం వహిస్తున్నప్పుడు స్క్రిప్టును తన చేతిరాతలోనే రాసుకోవడం ఆయనకు అలవాటు. అందుకోసం ఆయన మూడు రకాల ఇంకు పెన్నులు వాడేవారని ప్రత్యక్ష సాక్షులైన ఆ తరం నటులు చెబుతారు. రచయిత రాసి ఇచ్చిన డైలాగులను ముత్యాల కోవ లాంటి తన రాతలో మళ్ళీ రాసుకొనేవారు ఎన్టీయార్. అందుకోసం ఒక రంగు ఇంకు పెన్ను వాడేవారు. ఇక, కెమేరా యాంగిల్స్‌ను మరో రకం ఇంకుతో, యాక్షన్ పార్ట్‌ను వేరొక రకం ఇంకు పెన్నుతో రాసుకొనేవారు. ఇలా దేనికది చూడగానే స్పష్టంగా తెలిసేలా ఉండేది. అందుకే, ఎన్టీయార్ రాసుకున్న సినిమా స్క్రిప్టులు సినీ అధ్యయనపరులకు ఇవాళ్టికీ మంచి పాఠ్య పుస్తకాలు!

హీరో అక్కినేని నాగేశ్వరరావు సైతం, "బ్రదర్ ఎన్టీయార్ దర్శకత్వంలో 'చాణక్య – చంద్రగుప్త'లో నటించాను. దర్శకుడిగా ఆయన దృష్టి అంతా స్క్రిప్టు మీద ఉండేది. ఆయన పద్ధతి దర్శక దిగ్గజం కె.వి.రెడ్డి గారి లాగా ముందే స్క్రిప్టు అంతా పూర్తిగా తయారు చేసుకోవడం, పాత్రలు, పాత్రధారులు, కాస్ట్యూమ్స్, సెట్స్ – ఇవన్నీ పక్కాగా చూసుకోవడం. అలా చూసుకొని, అంతా పాత పద్ధతిలో క్రమశిక్షణతో పని చేయించేవారు. సెట్స్ తియ్యడంలో 'జిమ్నాస్టిక్స్' చేయడమో, సర్కస్ ఫీట్స్ చేయడమో ఆయన విధానం కాదు. క్లీన్ టేకింగ్. ఆ 'చాణక్య – చంద్రగుప్త'లో నటిస్తున్నప్పుడు ఎంతో ఆనందం అనుభవించాను. హాయిగా ఉందనిపించింది. ఇద్దరం పాత్ర తీరు మీద ఒకే అవగాహనతో ఉన్నవాళ్ళం కాబట్టి, ఒకరికొకరం సహకరిస్తూ పనిచేశాం" అని ఒక సందర్భంలో వివరించారు.

దర్శకుడిగా అంత స్పష్టత, తీస్తున్న సన్నివేశం, చేస్తున్న పాత్రల మీద అంతకు అంత అవగాహన ఉండబట్టే ఏకకాలంలో మూడు పాత్రలు ధరిస్తూ, స్వీయ నిర్మాణంలో దర్శకత్వం కూడా వహిస్తూ, కేవలం 43 రోజుల్లో 'దాన వీర శూర కర్ణ' చిత్రం షూటింగ్‌ను ఎన్టీయార్ పూర్తి చేయగలిగారు. నాలుగు గంటల 7 నిమిషాల సుదీర్ఘ ప్రదర్శన సమయంతో ఈ 25 రీళ్ళ సినిమా ఇప్పటికీ అత్యధిక నిడివి తెలుగు సినిమాగా చరిత్రలో నిలిచిపోయింది. ఆ చిత్రంలో ఆయన చెప్పిన డైలాగులు అప్పట్లో క్యాసెట్లుగా జోరుగా అమ్ముడైతే, ఇక 'ఆచార్యదేవా! ఏమంటివేమంటివి?...' లాంటి డైలాగ్స్ ఈ స్మార్ట్‌ఫోన్ల యుగంలోనూ కాలర్‌ట్యూన్లుగా వినిపిస్తూనే ఉన్నాయి. చేపట్టిన పని మీద శ్రద్ధ, ఏకాగ్రత, ఆరు నూరైనా నూరు ఆరైనా అనుకున్నది సాధించాలనే పట్టుదల ఉంటే – ఎవరైనా ఏ స్థాయికి చేరతారో, ఏ కళాకృషి అయినా ఎంత చిరస్థాయిగా నిలిచిపోతుందో చెప్పడానికి ఇంతకు మించి ఉదాహరణ ఇంకేం కావాలి! తెర మీదా, వెనుకా కూడా విభిన్న పాత్ర పోషణతో తోటివారెవ్వరికీ లేనంత యశస్సును సంపాదించుకున్నారు కాబట్టే, నందమూరి తారక రామారావుది తెలుగు సినీ చరిత్రలో 'జగదేకవీరుని కథ'. అభిమానుల గుండెల్లో ఆయన, ఆయన సినిమాలు 'చిరంజీవులు'.

✦

భార్య బసవతారకంతో...

నట కుటుంబం

ఎన్టీఆర్‌కు నటనపట్ల సినిమా రంగం పట్ల వున్న ఆసక్తి ఆయన కుటుంబ సభ్యులకూ విస్తరించారు. ఆయన చిత్రాలన్నిటికీ తమ్ముడు త్రివిక్రమ రావు నిర్మాతగా వుండి అన్నీ చూసుకునేవారు. అకాలమరణం పాలైన కుమారుడు రామకృష్ణ పేరు తన బ్యానర్‌కు పెట్టుకున్నారు. హరికృష్ణ, బాలకృష్ణలను చిన్న తనంలోనే ఫలవంతమైన పాత్రలలో పరిచయం చేశారు. తర్వాత కాలంలో బాలకృష్ణ అగ్రహీరో కాగలిగారు. హరికృష్ణ కూడా ఒక తరహా పాత్రలతో కొన్ని విజయాలు సాధించారు. ఇక తర్వాతితరంలో ఆయన కుమారుడైన జూనియర్ ఎన్టీఆర్ తారాపథం చేరగలిగారు. కళ్యాణ్‌రామ్, తారకరామ్... కూడా చిత్రాలు తీశారు. ఎన్టీఆర్ పెద్దల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు నిర్మాతగా చిత్రాలు తీశారు. ఇక చంద్రబాబు నాయుడు సినిమాటోగ్రఫీ మంత్రిగానే ఆయన దృష్టిలో పడి అల్లుడుగా తర్వాత తెలుగు దేశం కార్యదర్శిగా మంత్రిగా మారి చివరకు ఆయన స్థానానికే సంఘర్షణ పడగలిగారు. కుటుంబ నియంత్రణలో నమ్మకం లేని ఎన్టీఆర్ నిరంతరం షూటింగులలో మునిగితేలుతుంటే సతీమణి బసవ తారకం అన్నీ చక్కబెట్టేవారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక కొద్దికాలంలోనే ఆమె క్యాన్సర్‌తో మరణించారు. ఆమె జ్ఞాపకార్థం నిర్మించిన హాస్పిటల్ వేలాది రోగులకు సేవలందిస్తున్నది. దానికి బాలకృష్ణ ఛైర్మన్‌గా వున్నారు.

అల్లూరి సీతారామరాజుగా...

కుమారులతో ఎన్టీయార్...

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

ప్రారంభించబోయే పత్రిక న్యూ రైనిష్ జైటుంగ్ కోసం ఆధిపత్య పోరు కొనసాగింది. తను కూడా కొంత పెట్టుబడి పెట్టి, పత్రికను హెస్ నుండి తన అధీనంలోకి తీసుకున్నాడు మార్క్స్. ఆ తర్వాత కమ్యూనిస్టు లీగ్ సభ్యుల్ని సిబ్బందిగా నియమించుకున్నాడు. ఇప్పుడు ఆ పత్రికకు సంపాదకుడు కూడా తనే.

కొలోన్‌లోని ఒక ఖరీదైన ప్రాంతంలో అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకున్నారు మార్క్స్ దంపతులు. అక్కడ రాజప్రాసాదాలు లేవు గాని రాజప్రాసాదాల్లాంటి ధనవంతుల బంగళాలున్నాయి. అయితే, అక్కడ ఉండటం ఎంత వరకూ క్షేమం? ఎనిమిది వేల మంది వున్న ప్రష్యన్ మిలిటరీ క్యాంప్ పక్కనే ఉంటుంది అపార్ట్‌మెంట్. రోజంతా ఆయుధాలు తరలిస్తున్న శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. సైన్యం కదలికలు చూస్తుంటే ఎవరిమీదో యుద్ధానికి సిద్ధమవుతున్నట్టుగా తెలిసింది. ఈ సైనిక దాడిని తట్టుకోవటానికి పత్రికా సిబ్బంది ఎనిమిది రైఫిళ్లు, 250 తూటాలు పెట్టుకుని ఆత్మరక్షణకు ప్రయత్నించారు! మార్క్స్ దగ్గర కూడా ఒక తుపాకీ ఉంది.

మొత్తం మీద జూన్ 1, 1848 ఆ ఉద్రిక్త పరిస్థితుల్లో 'న్యూ రైనిష్ జైటుంగ్' ప్రారంభమైంది. పబ్లిషర్లు దీన్ని 'ప్రజాస్వామ్యంలో భాగస్వామి' అన్నారు. యూరప్‌లో జరుగుతున్న ప్రజాస్వామ్య పోరాటాలను, సంఘర్షణలను యథాతథంగా రిపోర్టు చేయడం ఈ పత్రిక ప్రత్యేకత. పాఠకులను చైతన్య పరచటం 'పత్రికల ముఖ్య బాధ్యత' అని నమ్మాడు మార్క్స్. ఇతర దేశాలలో, ఇతర ప్రాంతాలలో జరుగుతున్న పోరాటాల గురించి తెలుసుకుంటే తప్ప వాళ్లు

> **" సిబ్బంది కొరతతో, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న న్యూ రైనిష్ జైటుంగ్ ప్రచారం మీద కేంద్రీకరించింది. రంగురంగుల ప్లకార్డులు కొలోన్ వీధుల్ని అలంకరించాయి. బీరు, వైను షాపుల్లో, చందాదారుల జాబితా ప్రదర్శించారు. అయితే, వీటి కన్నా, ఆ పత్రికలోని వార్తాకథనాలు పాఠకుల్ని ఎక్కువ ఆకట్టుకున్నాయి. ఇన్నాళ్లూ పత్రికలపై ఆంక్షలతో విసిగిపోయిన వాళ్లు ఇప్పుడు బాహాటంగా, ధైర్యంగా ప్రచురిస్తున్న రిపోర్టులలోని నమ్మలేని నిజాలకు అవాక్కయ్యారు. "**

ఉద్యమానికి సంసిద్ధులు కాలేరు. కాని అప్పటికి ఇతర దేశాల నుండి వస్తున్న వార్తలు అంత ఉత్తేజకరంగా లేవు. ఉద్యమ తీవ్రత తగ్గింది. పోరాట యోధులు పురోగమించడం లేదు సరికదా తిరోగమిస్తున్నారు.

ఫిబ్రవరి–జూన్ నెలల మధ్య తొలిరోజుల విప్లవోత్సాహం తగ్గింది. వర్గాల మధ్య పెరిగిన పరస్పర అపనమ్మకంతో వైషమ్యాలు పెరిగాయి. మధ్యతరగతి వాళ్లు ఇది తమ విజయమనే అనుకున్నారు కాని, విప్లవంలో అనేక త్యాగాలు చేసిన కార్మికవర్గానికి లాభం చేకూరకపోతే పరిస్థితి తారుమారవుతుందని వాళ్లకు తెలుసు. మధ్యతరగతి ప్రయోజనాలు నెరవేరి, ఓటింగ్ హక్కులు కూడా సాధించుకున్న తర్వాత తమ ప్రత్యేక హోదా తగ్గిందని కినుక వహించారు ఉన్నత వర్గాల వాళ్లు. ఆకలిగొన్నవాళ్ల అవసరాలు తీర్చటం కోసం, మధ్యతరగతి వాళ్లు తమ మీద పన్నుల భారం మోపుతారని భయపడ్డారు రైతులు. 'ప్రభుత్వాన్ని పడగొట్టడం సులభం. కొత్త వ్యవస్థను నెలకొల్పడం కష్టం' అని అనుభవం మీద తెలిసింది అది కష్టం కాదు. అసాధ్యం!

ఫ్రాన్సులో తాత్కాలిక ప్రభుత్వ అధ్యక్ష పదవి ఒక ఎనభై ఏళ్ల మేధావి, రచయిత, కవి, విప్లవ యోధుడు అల్ఫాన్స్ మారీలూయీడి లామార్టైన్‌ను అలంకరించింది. ఈయన గొప్ప వక్త. మాటల తూటాలతో ప్రత్యర్థులను తుడిచి పెట్టగలడు. అయితే ప్రభుత్వంలో ఈయన సహచరులందరూ కొత్తవాళ్లు. పరిపాలనా అనుభవం లేదు. పైగా, ప్రభుత్వం ఎలా వుండాలి, ఏం చెయ్యాలి అన్న విషయాలపై ఎవరి అభిప్రాయాలు వాళ్లకున్నాయి.

ప్రభుత్వంలో ఇంత గందరగోళం నెలకొన్నప్పటికీ, వాళ్లు సాధించిన విజయాలు తక్కువేమీ కాదు. వలస దేశాలలో బానిస విధానం రద్దు, పురుషులందరికీ ఓటింగ్ హక్కు, సమావేశాలు పెట్టుకోవటానికీ, పత్రికలకూ స్వేచ్ఛ, ఉద్యోగాల కల్పన కోసం చర్యలు, పని గంటల తగ్గింపు, రాజకీయ నేరాలకు మరణశిక్ష రద్దు వంటివి వాళ్లు చేసిన సంస్కరణల్లో కొన్ని మాత్రమే. అయినప్పటికీ, సమాజంలో ఉద్రిక్తత, అసంతృప్తి తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల్లో, రాజధానిలో తీసుకుంటున్న నిర్ణయాల పట్ల నమ్మకం లేదు. 1827లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను ఇంకా

ఉపసంహరించలేదు. అడవుల్లో పడి ఉన్న కలప ఏరుకోవటం ఇంకా నిషిద్ధమే. దీనికి తోడు భూమి మీద 45 శాతం అదనపు పన్ను విధించడంతో రైతుల కోపం కట్టలు తెంచుకుంది. రాబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థుల తరపున ప్రచారం చెయ్యటానికి పారిస్ నుండి ప్రభుత్వ సమర్థకులు కొందరు రావడంతో, ఇక రాజకీయంగా కూడా తమను అణచివేయాలనుకుంటున్నారని రగిలిపోయారు రైతులు. నిజానికప్పటికి తొంభై లక్షల మందితో ఎన్నికల ప్రక్రియ నిర్వహించటానికి అవసరమైన సామర్థ్యం ప్రభుత్వానికి లేదు.

ఎన్నికల రోజున జనం భారీగా తరలి వచ్చారు. 84 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటించినప్పుడు, ఎన్నికైన 876 మందిలో రాడికల్స్/సోషలిస్టులు వందకన్నా తక్కువ మంది, అత్యధికులు కన్సర్వేటివ్‌లు లేదా మాడరేట్‌లు – వీళ్లలో ఎక్కువ మంది లూయీ ఫిలిప్ పాలనలో అధికారంలో ఉన్న వాళ్లే. ఓట్లేసిన పారిస్ పౌరులు, తమకు ఎన్నికల్లో ప్రాతినిధ్యం లభించలేదనుకున్నారు. తాము ఓడించామనుకున్న ధనిక వర్గమే తిరిగి అధికారం చేజిక్కించుకుంది.

"కూలీ దొరక్క లక్ష మంది కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారు. వాళ్ల బుర్రల నిండా పనికిరాని సిద్ధాంతాలు. సమాజం నిలువునా చీలిపోయింది. ఒకవైపు ఏమీ లేని పేదలు – అవకాశం దొరికితే దోచుకుందామని నిరీక్షిస్తున్నారు. మరోవైపు కొద్దోగొప్పో ఉన్నవాళ్లు – ఈ పేదలు తమ మీద ఎప్పుడు దాడి చేస్తారోననే భయంతో బతుకుతున్నారు. ఇదీ రాజధానిలో నాకు కనిపించిన దృశ్యం" అన్నాడు తుకెవిల్. ఇతను ఒక ప్రాంతీయ నియోజక వర్గం నుండి పార్లమెంటుకు ఎన్నికైన సభ్యుడు.

మే 15 నాడు, అసంతృప్తితో రగిలిపోతున్న కార్మికులు, అతివాదుల నాయకత్వంలో నేషనల్ అసెంబ్లీ (పార్లమెంట్) మీద దాడి చేసి, లోపల వున్న వాళ్లందర్నీ భయభ్రాంతుల్ని చేశారు. ఆ తర్వాత సభాధ్యక్షుని కుర్చీ మీద ఎర్రటి టోపీ పెట్టి "కొత్త" తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అయితే వీళ్ళ 'పాలన' కొన్ని గంటలు మాత్రమే కొనసాగింది.

ఫ్రెంచి ప్రభుత్వం తొలి ప్రమాదం నుండి గట్టెక్కింది. ఇప్పుడివన్నీ కేవలం నాటకీయ పరిణామాలుగా కనిపించినా, కొత్తగా ఏర్పడుతున్న సామాజిక వ్యవస్థకు అతివాదుల నుండి వున్న బెడదను స్పష్టం చేస్తున్నాయి. మధ్యతరగతి వాళ్లు, ధనిక వర్గం కన్నా కార్మిక వర్గమే ఎక్కువ ప్రమాదకరమనుకున్నారు.

ప్రష్యాలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. మార్చి 18 తర్వాత, ఫ్రీడ్రిక్ విల్హెమ్ రాజు తన మంత్రివర్గంలో ఉదారవాదులను ఎక్కువ మందిని తీసుకున్నాడు. ఒకప్పుడు రైనిష్ జైటుంగ్‌కు వెన్నుదన్నుగా వున్న మార్క్స్ మిత్రుడు లుడాల్ఫ్ కాంఫ్‌హాసెన్ ఇప్పుడు ప్రధానమంత్రి, మరో మిత్రుడు డేవిడ్ హాన్సేమాన్ ఆర్థికమంత్రి. "ప్రష్యాలో వస్తున్న మార్పులకనుగుణంగా కొత్త ప్రజాప్రతినిధులు ఎన్నుకోవటానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జర్మన్ సమాఖ్య స్థానంలో, కొత్త జర్మనీని ఏర్పాటు చెయ్యాలని సంకల్పించారు. అందుకోసం సమాఖ్య అంతటా ఎన్నికలు నిర్వహించాలి. కాని ఫ్రాన్సులో లాగానే, జర్మన్ పౌరులకు కూడా ఎన్నికల ప్రక్రియ ఇంకా కొత్తే. ఓటర్లను తమ వైపుకు తిప్పుకోవటానికి వివిధ గ్రూపులు తీవ్రంగా కృషి చేశాయి. కన్సర్వేటివ్‌లకు పాత వ్యవస్థ కావాలి. మధ్యేవాదులకు ప్రగతి కావాలి కాని అలజడి వద్దు. డెమోక్రాట్లకు మార్చి విప్లవ ఫలితాల ప్రయోజనాలు కావాలి. గాట్‌చాక్

" ఫ్రెంచి ప్రభుత్వం తొలి ప్రమాదం నుండి గట్టెక్కింది. ఇప్పుడివన్నీ కేవలం నాటకీయ పరిణామాలుగా కనిపించినా, కొత్తగా ఏర్పడుతున్న సామాజిక వ్యవస్థకు అతివాదుల నుండి వున్న బెడదను స్పష్టం చేస్తున్నాయి. మధ్యతరగతి వాళ్లు, ధనిక వర్గం కన్నా కార్మిక వర్గమే ఎక్కువ ప్రమాదకరమనుకున్నారు.
ప్రష్యాలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. మార్చి 18 తర్వాత, ఫ్రీడ్రిక్ విల్హెమ్ రాజు తన మంత్రివర్గంలో ఉదారవాదులను ఎక్కువ మందిని తీసుకున్నాడు. "

లాంటి వాళ్లు ఎన్నికలను బహిష్కరించవలసిందిగా ప్రచారం చేశారు. రైతులు, కార్మికులూ ఎన్నికలకు ముందే తమ ప్రయోజనాలు నెరవేరాలన్నారు. వాళ్లవి తక్షణ అవసరాలు.

మార్చి నెలలో వృత్తి పనివాళ్లు, పనిభద్రత, తగిన ప్రతిఫలం కావాలని తిరుగుబాట్లు చేశారు. ఈ ఫ్యాక్టరీ వ్యవస్థ వల్ల వృత్తులు నాశనమవుతున్నాయి. తాము పని కోల్పోతున్నాము. మళ్లీ పాత రోజులు వస్తే తప్ప తాము మనుగడ కొనసాగించలేము. సిలేషియన్ నేత కార్మికుల్లాగే వీళ్లు కూడా సంపన్నుల ఇళ్ల మీదా, ఫ్యాక్టరీల మీదా దాడి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల తిరుగుబాట్లు కొనసాగాయి. చిన్న కమతాలను కొనుక్కుని తమ పొలాల్లో కలుపుకున్న భూస్వాములకు వ్యతిరేకంగా జరిగింది



అల్ఫాన్స్ మారీలూయిడి లామార్టైన్

పోరాటం. భూములను కోల్పోయిన రైతులే దీనికి నాయకులు.

అంతా సవ్యంగా ఉందనుకున్నప్పుడు కూడా రాజకీయ సంస్కరణలు చేపట్టడం కష్టసాధ్యమైన విషయమే. ఆర్థిక సంక్షోభం సృష్టించిన సామాజిక సుడిగుండంలో అవి అసాధ్యం. ఉదారవాద బూర్జువాలు ఈ కొత్త పరిస్థితిని బాగానే అంచనా వేశారు. "విప్లవం ప్రమాదకరమైంది. ఆర్థిక డిమాండ్లు నెరవేర్చుకోవటానికి విప్లవం అవసరం లేదు". అంటే వాళ్లు విప్లవకారుల రాజకీయ డిమాండ్లను అంగీకరించరు గాని ఆర్థిక డిమాండ్లకు అడ్డుపడరు.

కొత్త ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితి కొంత కుదుట పడింది. పరపతి విధానం సరళీకరించడంతో అవసరానికి అప్పు సులభంగా దొరికి వ్యాపారస్తులు బాగు పడ్డారు. (చివరికి, రాజుగారు ప్రారంభించాలనుకున్న రైల్వే పరిశ్రమకు కూడా అప్పు దొరికింది). వ్యాపారస్తులను శాంతింపచేసి త్వరలోనే వృత్తిపనివాళ్లనూ, రైతులనూ ఆదుకుంటామన్నది ప్రభుత్వం. కాని వీళ్లక్కావలసింది వాగ్దానాలు కావు. కేవలం మాటలతో మభ్యపెట్టాలనుకుంటే కొత్త ప్రభుత్వానికీ, పాతదానికీ తేడా ఏమిటి?

ఎన్నికల ప్రకటనల్లోని అస్పష్టతతో అసలే ఉద్రిక్తంగా ఉన్న పరిస్థితి మరింత దిగజారింది. ఎన్నికల చట్టంలో "చట్టబద్ధమైన వయోపరిమితికి లోబడి అందరూ ఓటెయ్యటానికి అర్హులే" అన్నారు. కాని వాళ్లకు ఓటేసే హక్కుందని స్పష్టం చెయ్యలేదు. జీతాల మీద ఆధారపడ్డ వ్యక్తుల్ని వాళ్ల 'స్వతంత్ర జీవితం' గడపటం లేదనే నెపంతో ఓట్లు వెయ్యనివ్వలేదు. సంచార వృత్తుల వాళ్లనూ, వలస కూలీలనూ నగరాల్లో ఓటింగ్‌కు

అనుమతించలేదు. ఒక ప్రాంతంలోనైతే బ్రహ్మచారులకు, యూదులకు కూడా ఈ హక్కు నిరాకరించారు. ఓట్లు లెక్కపెట్టేసరికి అర్హులైన ఓటర్లలో సగం మంది మాత్రమే తమ హక్కు వినియోగించుకున్నారని తెలిసింది. కొన్ని చోట్ల ఇది 30 శాతానికి మించలేదు. ఓట్లు వెయ్యని వాళ్లలో ఎక్కువ మంది కార్మికులూ, ఇతర నిమ్న వర్గాల వాళ్లూ. సహజంగానే వీళ్లకు విజేతలు అధికారవర్గ తొత్తుల్లాగ కనిపించారు. కొత్తగా ఎన్నికైన జర్మన్, ప్రష్యన్ ప్రతినిధుల సభలు నిరుపయోగమైనవి. ఎన్నికైన వాళ్లంతా అసమర్థులు అని ప్రకటించింది న్యూ రైనిష్ జైటుంగ్.

ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన జర్మన్ నేషనల్ అసెంబ్లీ సమావేశాలు అందర్నీ నిరుత్సాహ పరిచాయి. ఈ అసెంబ్లీకి ఇదే తొలి సమావేశం. దాని అధికారాలేమిటో స్పష్టంగా తెలియవు. జర్మనీలోని అత్యున్నతమైన ప్రతినిధుల సభ ఇదే. కాని అప్పటికి ఇంకా 'జర్మనీ' ఆవిర్భవించలేదు. అందువల్ల దీనికి చట్టాలను చేసే అధికారం ఉందో లేదో తెలియదు. "ఇది ఒక ఊహాజనిత దేశ చట్టసభ. ఊహాజనితమైన విషయాలు చర్చించింది. ఊహాజనిత ప్రభుత్వం తనకు తాను ఉనికిని కల్పించుకునే ప్రయత్నం చేసింది. ఎవరూ ఖాతరు చెయ్యని ఊహాజనిత ప్రతిపాదనలను ఆమోదించింది" అన్నాడు ఎంగెల్స్.

సిబ్బంది కొరతతో, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న న్యూ రైనిష్ జైటుంగ్ ప్రచారం మీద కేంద్రీకరించింది. రంగురంగుల ప్లకార్డులు కొలోన్ వీధుల్ని అలంకరించాయి. బీరు, వైను షాపుల్లో, చందాదారుల జాబితా ప్రదర్శించారు. అయితే, వీటి కన్నా, ఆ పత్రికలోని వార్తాకథనాలు పాఠకుల్ని ఎక్కువ ఆకట్టుకున్నాయి. ఇన్నాళ్లూ పత్రికలపై ఆంక్షలతో విసిగిపోయిన వాళ్లు ఇప్పుడు బాహాటంగా, ధైర్యంగా ప్రచురిస్తున్న రిపోర్టులలోని నమ్మలేని నిజాలకు అవాక్కయ్యారు. యూరప్‌లోని విలేకర్ల కథనాలు, ఇతర విదేశీ విలేకర్ల కథనాలూ పరస్పర మార్పిడి అవగాహనతో ప్రచురించటంతో అత్యధిక విదేశీ సమాచారం ప్రచురించే పత్రికగా న్యూ రైనిష్ జైటుంగ్‌కు పేరొచ్చింది. మార్క్స్ సంపాదకత్వంలో ఆ పత్రిక సాధించిన ఘనత అది. సర్క్యులేషన్ అయిదువేల మంది చందాదారులకు పెరిగింది. (అరువు తీసుకుని చదివేవాళ్లను కూడా కలిపి సంఖ్య అనేక రెట్లుంటుంది) ముప్పైతొమ్మిది జర్మన్ రాష్ట్రాలలో అత్యధిక పాఠకులున్న పత్రిక ఇదే. దీని ఖ్యాతి లేదా పాపులారిటీ ఎంతోమందిని ఆకర్షించింది. అమెరికాలో కూడా దీని అభిమానులు పెరిగారు.

ఈ పత్రిక ఎలా నడుస్తుందో చూడాలని అందరి కోరిక. 'సంపాదకుడు ఒక నియంత' అంటాడు ఎంగెల్స్. న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ (పత్రిక) తరపున రైన్‌లాండ్ వచ్చిన అమెరికన్ సోషలిస్టు ఆల్బర్ట్ బ్రిస్బేన్ మార్క్స్ 'సాదాసీదాగా ఉంటాడు. మితభాషి'. 'ఆయన ధైర్యం, నిబద్ధత గొప్పది' అన్నాడు. తర్వాతి రోజుల్లో యు.ఎస్ అంతరంగిక విషయాల సెక్రటరీగా పని చేసిన కార్ల్ షుర్జ్, మార్చి 18 నాటి తిరుగుబాటు కాలంలో బెర్లిన్‌లో ఉన్నాడు. అప్పటికి అతడి వయసు పంతొమ్మిదేళ్లు. తిరుగుబాట్లు ఎలా ఉంటాయో ప్రత్యక్షంగా చూడటం అదే మొదటిసారి. కొలోన్ వెళ్లి, మార్క్స్ ఉపన్యసిస్తుండగా విని "అప్పటికి ఆయన

" విశాలమైన నుదురు. అతని నల్లని జుత్తు, గడ్డం, మెరిసే కళ్లు ఎవర్నైనా ఇట్టే ఆకర్షిస్తాయి" అంటూ రాశాడు. కాని ఆయన ఉపన్యాసం భరించలేకపోయాను. తనతో విభేదించిన వాళ్ల పట్ల ఆయన ప్రవర్తన దారుణంగా ఉండేది. నచ్చని వాదనను ఆయన కేవలం తిరస్కరించడు. గాయపరిచే వ్యంగ్యంతో ఎద్దేవా చేస్తాడు. అంతులేని అజ్ఞానంతో మాత్రమే ఎదుటి మనిషి తనతో విభేదిస్తున్నాడంటాడు. అసలు అలా విభేదించటం వెనుక ఉన్న వ్యక్తి ఉద్దేశాన్ని కూడా ప్రశ్నిస్తున్నాడు. "

వయస్సు ముప్పైకి మించదు. కాని అప్పటికే ఆయన సోషలిస్టులందరికీ నాయకుడు. కాస్త బలిష్టంగా ఉంటాడు. విశాలమైన నుదురు. అతని నల్లని జుత్తు, గడ్డం, మెరిసే కళ్లు ఎవర్నైనా ఇట్టే ఆకర్షిస్తాయి" అంటూ రాశాడు. కాని ఆయన ఉపన్యాసం భరించలేకపోయాను. తనతో విభేదించిన వాళ్ల పట్ల ఆయన ప్రవర్తన దారుణంగా ఉండేది. నచ్చని వాదనను ఆయన కేవలం తిరస్కరించడు. గాయపరిచే వ్యంగ్యంతో ఎద్దేవా చేస్తాడు. అంతులేని అజ్ఞానంతో మాత్రమే ఎదుటి మనిషి తనతో విభేదిస్తున్నాడంటాడు. అసలు అలా విభేదించటం వెనుక ఉన్న వ్యక్తి ఉద్దేశాన్ని కూడా ప్రశ్నిస్తున్నాడు. షుర్జ్ ప్రకారం "మార్క్స్ ప్రవర్తన

ఫ్రీడ్రిక్ విల్హెమ్

ఇంత ఆక్షేపణీయంగా ఉండకపోతే, ఆయన అనుయాయులు మరెన్నో రెట్లు పెరిగేవారు".

కాని మార్క్స్‌కు అత్యంత సన్నిహితులు జెన్నీ, ఎంగెల్స్ మాత్రం "తాను సత్యమని నమ్మిందే ఆయన వాదించాడు. ఇంత ముఖ్యమైన విషయం ఇతర్లు ఎందుకు గ్రహించటం లేదనే ఆయన కోపం" అన్నారు. రాజకీయ సంబంధమైన విషయాల్లో ఆయనకు ఆత్మ సంశయం ఏమాత్రం ఉండేది కాదు. ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొందరు అహంకారమనుకున్నారు. అయితే, ఈ ప్రవర్తనతో అతను ఎంతో నష్టపోయాడనటంలో సందేహం లేదు. మౌలికంగా అతను జర్నలిస్ట్, తాత్వికుడు, ఆర్థిక శాస్త్రవేత్త. వీటి ద్వారా అతడు రాజకీయ సమస్యలకు పరిష్కారాలు వెదికాడు కాని ఆయన పొలిటీషియన్ కాడు. తననందరూ ప్రేమించాలని, ఇష్టపడాలనీ ఎప్పుడూ కోరుకోలేదు. తనను ఇష్టపడ్డ వాళ్లపట్ల ఆయన అభిమానానికి అవధులుండవు. తన వల్ల ఎవరైనా గాయపడతారేమోననే విషయం ఆయనెప్పుడూ ఆలోచించలేదు.

కొలోన్‌లో, క్రమంగా ఆయన శత్రువులు కూడా పెరిగారు. ఈ శత్రువుల్లో కొందరు పత్రికకు పెట్టుబడి పెట్టిన వాళ్లు. వాళ్లకు కోపమొస్తే పత్రిక బతకటం కష్టం. జూన్ 5 నాటి పత్రికలో "మార్చి 18 తిరుగుబాటు"ను కేవలం ఒక 'అల్లరిమూకల పని'గా గుర్తించాలని ప్రైమినిస్టర్‌కు సూచించాడు మార్క్స్. ఇది చూసి మార్క్స్ అతివాదం వైపు మొగ్గు చూపుతున్నాడనుకున్నారు పత్రిక స్టాక్ హోల్డర్లు. అంటే ఆయన చర్యల్ని వాళ్లు సమర్థించరు. అయితే ఈసారి కథ మలుపు తిరిగింది, స్థానిక సంక్షోభం వల్ల కాదు. పారిస్‌లో రక్తపుటేరులు పారించిన యుద్ధం దానికి కారణం.

సశేషం

▪ ఫోన్: 91776 18708

సోయా స్పెషల్స్

సమోస

కావలసిన పదార్థాలు: నలుగురికి

సోయా గ్రాన్యూల్సు: 50 గ్రాములు, బంగాళ దుంపలు: 2, జీలకర్ర: 1 చిన్న చెంచా, అల్లం ముద్ద: 2 చిన్న చెంచాలు, వెల్లుల్లి ముద్ద: 2 చిన్న చెంచా, పచ్చిమిర్చి ముక్కలు: రుచికి సరిపడ, కారంపొడి: తగినంత, ధనియాల పొడి: 1 చిన్న చెంచా, ఉప్పు: తగినంత, ఛాట్ మసాల: 2 చిన్న చెంచాలు, మైదాపిండి: 250 గ్రాములు, నెయ్యి: 2 పెద్ద చెంచాలు, అజ్వాయిన్: 1 చిన్న చెంచా, సోయా రిఫైండు నూనె: 2 చిన్న చెంచాలు, మరియు వేయించటానికి.

తయారు చేసే విధానము:

సోయా గ్రాన్యూల్స్‌ను వేడి నీటిలో 15 నిమిషాలు నానబెట్టి , నీరు లేకుండా పిండాలి. బంగాళదుంపలను ఉడికించి , తొక్క తీసి మెత్తగా చిదమాలి. దానిలో గోధుమ పిండి , నెయ్యి, అజ్వాయిన్, ఉప్పు కలిపి ముద్దగా చేసి, తడిగుడ్డతో కప్పి ఉంచాలి. బాండిలో 2 చిన్న

చెంచాల నూనెను వేడిచేసి, జీలకర్ర వేసి కొద్ది సెకండ్ల తర్వాత అల్లం ముద్ద, వెల్లుల్లి ముద్ద, పచ్చిమిర్చి ముక్కలు , కారం, ధనియాల పొడి, ఉప్పు, చాట్ మసాల వేసి బాగా కలిపాలి, సోయా గ్రాన్యూల్స్ , చిదిమిన బంగాళదుంపలను వేసి చక్కగా ఉడికించాలి. ఆ ముద్దను చిన్న ఉండలుగా చేసి ఒక్కో ఉండను కోడిగుడ్డు ఆకారంగా చేసి రెండుగా కోయాలి. ఒక్కొక్క భాగాన్ని ఎడమ చేతిలో పట్టుకొని శంఖము మాదిరిగా చేసి దానిలో సోయా గ్రాన్యుల్సు బంగాళదుంప ముద్దను (పైన 2 లో చెప్పినది) కూరి అంచులను నీటితో తడిచేసి మడవాలి. వేడినూనెలో బంగారువర్ణము వచ్చేవరకు వేయించాలి. సోయాసమోసా రెడీ.

కట్ లెట్

కావలసిన పదార్థాలు:

సోయా గ్రాన్యూల్సు: 100 గ్రాములు, బంగాళదుంపలు: 2, బ్రెడ్ ముక్కలు: 115 గ్రాములు, ధనియాల గింజలు: 1 చిన్న చెంచా, అల్లం ముద్ద: 2 చిన్న చెంచాలు, వెల్లుల్లి ముద్ద: 2 చిన్న చెంచాలు, పచ్చిమిర్చి: రుచికి సరిపడ కారంపొడి: తగినంత, ధనియాల పొడి: 1 చిన్న చెంచా, ఉప్పు: తగినంత, పసుపు పొడి: చిటికెడు, సోయా రిఫైండు నూనె: వేయించుటకు

తయారు చేసే విధానము:



సోయా గ్రాన్యూల్స్‌ను వేడినీటిలో 15 నిమిషాలు నాన బెట్టి నీరు లేకుండా పిండాలి. బంగాళదుంపలను ఉడికించి తొక్క తీసి మెత్తగా చిదమాలి. పచ్చి మిర్చి కడిగి ముక్కలుగా కోయాలి. బాండీలో 2 చెంచాల నూనె వేడి చేసి ధనియాల గింజలు వేసి 30 సెకండ్ల తర్వాత అల్లం ముద్ద వెల్లుల్లి ముద్ద పచ్చిమిర్చి ముక్కలు వేసి ఒక నిమిషం పాటు కదపాలి. కారం పొడి ధనియాల పొడి పసుపుపొడి వేసి తిప్పుతూ ఉండాలి. సోయా గ్రాన్యూల్సు వేసి గ్రాన్యూల్స్ ఉడికి పొడిగా అయ్యేవరకు వేయించాలి. చిదిపిన బంగాళదుంపలు ఉప్పువేసి ఆ మిశ్రమము పూర్తిగా పొడిగా అయ్యేవరకు ఉడకనివ్వాలి. పొయ్యి మీద నుంచి దింపి చల్లారనివ్వాలి. బ్రెడ్ పొడి వేసి బాగా కలపాలి. చిన్న ఉండలుగా చేసి ఒక్కో ఉండను కట్ లెట్ ఆకారంలో చేసుకొని నూనెలో కరకరలాడునట్లు బాగా వేయించి వేడిగా వడ్డించాలి.

మంచూరియ

కావలసిన పదార్థాలు: సోయా చెంక్స్: 100 గ్రాములు, మైదాపిండి: 4 పెద్ద చెంచాలు, మొక్కజొన్నపిండి: 2 పెద్ద చెంచాలు, మిరయాల పొడి: రుచికి సరిపడ, ఉప్పు: రుచికి సరిపడ, వెల్లుల్లి ముక్కలు: రుచికి సరిపడ, పచ్చిమిర్చి ముక్కలు: రుచికసరిపడ సోయా సాస్: 2 చిన్న చెంచాలు, అజినోమోటో : చిటికెడు, సోయా రిఫైండ్ నూనె: 2 చిన్న చెంచాలు కలపటానికి మరియు వేయించటానికి తగినంత

తయారు చేసే విధానము : సోయా చెంక్స్‌ను వేడి నీటిలో 15 నిమిషాలు నానబెట్టి నీటిని పిండాలి. 4 పెద్ద చెంచాల మైదాపిండి ఒక పెద్ద చెంచా మొక్కజొన్నపిండి ఉప్పు కలిపి చిక్కటి పిండి మిశ్రమము తయారు చేసుకోవాలి. అందులో సోయాచెంక్స్‌ను ముంచి చెంక్స్ లేత గోధుమ వర్ణము వచ్చేవరకు వేయించాలి. బాండిలో 2 చిన్న చెంచాల నూనె వేడిచేసి చిన్నుల్లి పచ్చిమిర్చి ముక్కలు వేసి ఒక నిమిషము కలియతిప్పిన తర్వాత, సోయాసాస్ అజినోమోటో, ఉప్పును కలిపి ఒక నిమిషము ఉడికించాలి. 2 పెద్ద చెంచాల నీరు పోసి ఉడకనివ్వాలి సాస్ చిక్కబడుటకు ఒక పెద్ద చెంచా మొక్క జొన్న పిండిలో కొద్దిగా నీరు కలిపి సాస్ లో పోయాలి. తయారైన సాసులో చెంక్స్ ఉండలు వేసి ఉడికించి వేడిగా వడ్డించాలి.

పెసరట్టు

కావాల్సిన పదార్థాలు: పచ్చ పెసలు: 200 గ్రాములు, సోయాచిక్కుళ్ళు: 100 గ్రాములు, అల్లం తురుము: 1 పెద్ద చెంచా, పచ్చిమిర్చి: రుచికి సరిపడ, ఉప్పు: రుచిక సరిపడ, సోయా రిఫైండ్ నూనె: వేయించుటకు

తయారు చేసే విధానము: సోయా చిక్కుళ్ళు పచ్చి పెసలు కలిపి ఒక రాత్రి నీళ్ళల్లో నానబెట్టి నీరు వార్చి అల్లం తరుము, మిర్చి ముక్కలు ఉప్పు కలపాలి. మెత్తగా గరిటెజారుడు పిండిగా రుబ్బాలి.. 2.1/3 కప్పు పిండిని పెనం మీద అట్టు పోసి అట్టు చుట్టూ ఒక చెంచా నూనె పోయాలి. పెసర అట్టు కింది భాగము బాగా కాలిన తర్వాత అట్టును తిరగవేయాలి. ఇంకొక చెంచా నూనె పోసి బంగారు వర్ణము వచ్చే వరకు కాలనీయాలి. కొబ్బరి లేక అల్లం చట్నీతో వేడిచేసి పెసరట్టు వడ్డించాలి.

ఏమేం వున్నాయి?



ఈ పక్షి విచిత్రంగా అనిపిస్తోంది కదా.
ఇందులో మూడు పక్షుల శరీర భాగాలున్నాయి.
అవేంటో చెప్పకోండి చూద్దాం.

జవాబు: 1. కొంగ కాళ్లు, 2. ఉష్ట్రపక్షి తల, 3. కోడి కాళ్లు,

మొత్తం ఎన్ని టోపీలు?



ఇక్కడ టోపీలన్నీ ఒక కుప్పలా వేశారు. ఇంతకీ ఇక్కడ ఎన్ని వున్నాయి?

జవాబు: పది టోపీలు



ఒంటె బొమ్మ వేద్దామా

మొత్తం ఎన్ని?

ఇక్కడ చిట్టి పుట్టిన రోజు పార్టీ జరుగుతోంది. మాంచి కేక్ కూడా తీసుకొచ్చారు. ఇంతకీ ఈ బొమ్మలో నాలుగు రకాల ఆకారాలు వున్నాయి. ఏ ఆకారం ఎన్ని సార్లు వచ్చిందో లెక్కించి చెప్పండి.

ఆరు తేడాలు కనిపెట్టండి

బండి లాగేది ఏదబ్బా..



శాంతాక్లజ్ తాత కూర్చున్న బండి లాగే జింక ఏదో చెప్పకోండి చూద్దాం.

ఞ :ంలుతుణూలు

కోడి నీడ



దీని పేరు చిక్కు. పేరుకు తగ్గట్టే చిక్కులు కొనితెచ్చుకుంటుంది.
ఓ రోజు తన నీడ మర్చిపోయింది.
ఇక్కడ మొత్తం నాలుగు నీడల్లో అసలైనది ఏదో మీరే చెప్పాలి.

లిటిల్ స్టార్



ఈ చిన్నోడెవరో చెప్పుకోండి

ఈ ఫోటోలో అమాయకంగా కనిపిస్తున్న ఈ చిన్నోడు ఎవరో చెప్పుకోండి చూద్దాం... ఏంటి, గుర్తుపట్టలేకపోతున్నారా ! అయితే కొంచెం క్లూ ఇస్తాం. మెదడుకు పదును పెట్టండి. ఇప్పుడు ఇతనో పెద్ద ఆటగాడు. వికెట్ల వెనుక నిల్చుని బ్యాట్స్‌మెన్‌కు ముచ్చెమటలు పట్టించడంలో మనోడు దిట్ట. చిన్న వయస్సులోనే క్రీడాభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకున్న క్రికెట్ స్టార్. అంతేకాదండి యూత్‌కి ట్రెండ్‌సెట్టర్ కూడా. ఆ మధ్య ఇతగాడి హెయిర్ స్టైయిల్ కుర్రకారుని ఉర్రూతలూగించిందనుకోండి. ఏంటి ఇంకా ఎవరో గుర్తుకురాలేదా .... అయితే సమాధానం కోసం **24**వ పేజీ చూడండి.



ఈ ఎలుక గారికి బాగా ఆకలిగా వుంది. చెట్టుమీద మాంచి మిగల పండిన పండ్లు కనిపించాయి. వెళ్లి తిందామంటే... పాపం దారి తెలీడంలా. మీరు చెప్పగలరేమో ప్రయత్నించండి.

◆ కొత్త పుస్తకాలు

మానవత్వానికి ఆనవాళ్లు

తెలుగు కథానిక వంద సంవత్సరాల చరిత్ర సంతరించుకొంది. వస్తువు ఎంపికలో వైవిధ్యం ప్రదర్శించిన డా॥ ప్రభావతి గారు ఈ సంపుటిలో 16 కథలు ప్రచురించారు. స్త్రీ దృకోణాన్ని కొన్ని కథల్లో చక్కగా ఆవిష్కరించారు. వినిమయ సంస్కృతి రాజ్యమేలుతున్న నేటి ప్రపంచీకరణ పరిస్థితుల్లో పల్లె సోయగాన్ని చాలా కథల్లో పల్లవింపజేసారు. మానవత్వ విలువల్ని ఇంకా బాగా ఆవిష్కరించారు. ఊరగాయ జాడీ, కొత్త వెలుగు, అనసూయ లేచిపోయింది, కామాక్షి కాసుల పేరు, సంధ్య అంచున, సిలకమ్మ, నాన్న కావాలి. న్యాయం గుడ్డిది, గెద్ద, నాకూ ఓ మనసుంది కథలు పాఠకుల్ని ఏకబిగువున చదివిస్తాయి. "ఊరగాయజాడీ" కథ ఆలోచింపజేస్తుంది. మనిషిలో స్వార్థం ఉండరాదు. పొరుగువారికి లేదా పని వారికి తోడ్పడాలి. సాయం చేయాలి. ఈ గుణం లేని వారు ఎంత గొప్పవారైనా సమాజానికి వృథా జీవితం గడుపుతున్నట్లే లెక్క. అమెరికాలో పని చేసే పెద్ద కొడుకు రఘురామ్‌కు ప్రతియేడు ఆవకాయ పెట్టించడం చేస్తుంటారు హనుమంతరావు, వెంకటరత్నం అనే బ్రహ్మణ దంపతులు. పని పిల్ల బుచ్చి అడిగినా ఆవకాయ ఇవ్వకుండటం. పక్కనున్న వెంకటాచలం ఇంట్లో పెళ్ళి, చుట్టాలు, బంధువుల కంటబడకుండా ఆవకాయ ఆటక మీద దాచడం, అది బూజుపట్టడం దాన్ని తీయబోయి నిచ్చెనమీద నుండి హనుమంతరావు పడటం, జాడీ పగిలిపోవడం బుచ్చి పగిలిన జాడీచూడటం తో కథ ముగుస్తుంది. నాటి విజేత దినపత్రిక లో ప్రచురణైన కథ నాకు "ఓ మనసుంది". బి.ఏ చదివిన విశాలిని తల్లిదండ్రులు ఉద్యోగం చేయనీయరు. పెళ్లైన తర్వాత భర్త శ్యామ్ ఉద్యోగం వద్దు అంటాడు. ఆలోచనలు, ఆశయాలు కళ్ళముందు కదలాడే లోపే ఇద్దరు బిడ్డల తల్లి అవుతుంది. అత్తమామలు వారి మరో కొడుకు దగ్గరకు వెళ్ళడం, ఇంట్లో కాలక్షేపం కోసం ప్రైవేటు చెపుతూ ఓ రెండు వేలుసంపాదించి తన కోరికను ఆలోచనల్ని నెరవేర్చుకొని సంబరపడటమే గాక పిల్లల కేర్ సెంటర్ పెట్టడం. పబ్లిక్ స్కూల్ ప్రిన్స్‌పాల్ విశాలిని 15 ఆగస్టు సంబరాల్లో అతిథిగా ఆహ్వానిం పబడటం...అత్త మామలు, భర్త...విశాలి హోదా, స్త్రీ సాధికారిత చూసి సంబరపడటంతో కథ ముగుస్తుంది. "నాకు ఓ మనసుంది" కథ మహిళలకు స్ఫూర్తి. "గెద్ద" కథానిక ఓ సోది చెప్పే ఎరుకులసాని కథ. ఆమె కొడుకు పందులు మేపుతూ జీవిస్తుంటారు. గెద్ద చేసే మంత్రసాని పని ఆమె కోడలు "జగ్గి" చేయడం...వయసు పైబడటంతో గెద్ద మరణంతో కథ ముగుస్తుంది. ఈ కథ కూడా పత్రిక మాసపత్రికలో ప్రచురణైన కథ. "కామాక్షి కాసుల పేరు" కథలో నగలపై మోజు గల స్త్రీ మనస్తత్వాన్ని కూతురి పాత్రలో ప్రతిబింబింపజేయడం, వెండి వస్తువులు కొని బంగారు(తాపడం) మాలాము చేయించడం, పెళ్ళి కుదరటం లాంటి ఘటనలు కథా కథనంలో మంచి పట్టు చూపారు ప్రభావతి గారు. భార్య భర్తల మధ్య ఆధిపత్య ధోరణి చూపే "తోడు నీడ" కథ వాస్తవానికి దగ్గరగా ఉంది. ఇలా అన్ని కథల్లో చదివించే గుణం సమకాలీన వస్తు ప్రాధాన్యత గల కథా సంపుటి ఇది.



వాసా ప్రభావతి కథానికలు
కవయిత్రి డా॥ వాసా ప్రభావతి
పేజీలు : 139, వెల : రూ.100,
ప్రతులకు : శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.
సెల్ : 9391343916/9849178196

కదిలించే కథలు

1952లో తెలుగుకథకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన కథారచయిత పాలగుమ్మి పద్మరాజు "గాలివాన" కథకు ద్వితీయ బహుమతి వచ్చింది. పోటీ పెట్టిన నిర్వాహకులే "సైక్లోన్" పేరిట ఆంగ్లంలోకి అనువదించారు. ఆ కథ (ఆంగ్లం, తెలుగు) చివర్లో అందించారు ఈ సంకలనంలో. ఇదో మంచి ప్రయోగం. ప్రయోజనం కూడా. పాలగుమ్మి పద్మరాజు శతజయంతి ముగుస్తూ – బుచ్చిబాబు గారి శతజయంతి ప్రారంభమవుతున్న సమయంలో వారిద్దరికీ నివాళిగా యీ గ్రంథాన్ని వేదగిరి రాంబాబు, కె.బి.గోపాలమ్ గార్లు ప్రచురించారు. అభినందనీయం. ఒక రైల్వేస్టేషన్‌లో రావుగారనే మధ్యతరగతి మనిషి... ముష్టి ఎత్తుతూ ప్లాట్ ఫాంపై జీవించే బిచ్చగత్తె స్వాంతనలో చీకట్లో ఇద్దరూ "గాలివాన"లో జీవించడం... తెల్లవారు జాముకు ఆమె మరణించి ఉండటం... ఆమె చేతిలో రావుగారి పర్సు, డబ్బు ఉండటం... పర్సుపై తన పేరువున్న(విజిటింగ్)కార్డు తీసివేసి బరువైన హృదయంతో అక్కడినుంచి రావుగారు వెళ్ళిపోవడంతో గాలివాన కథ ముగుస్తుంది. సైక్లోన్ పేరుతో ఈ పుస్తకంలోనే ఆంగ్లం (తర్జుమా) కథనూ ప్రచురించి ఇంగ్లీషు మీడియం చదివిన తెలుగు యువతకు మహోపకారం చేశారు. తెలుగు కథను చదివింపజేయడం మంచి ప్రయత్నం. 1938 మార్చి భారతి సంచికలో ప్రచురణైన 'బాల్యం' కథ, వియ్యన్న తాత మరణం లాంటి పద్మరాజు గారి కథలు యీ పుస్తకానికి వన్నెతెచ్చాయి. నాకు మరణమంటే గౌరవం తప్ప, భయం లేదు. ఈ సంగతి బాగా మనసునకు ఎక్కించుకొని అనేక అనువాద కథలు సృష్టించిన వారు కె.బి.గోపాలం. ఆ ధోరణితో సాగిన కథా గుచ్ఛామే ఇది... ప్రీతిష్‌నందీ ఆంగ్ల కథ "అర్జున్ తిరిగిరాలేదు" కథను గోపాలం గారు చక్కగా అనువదించారు. వీరేంద్ర అనే ఆయన అనారోగ్యంతో వుండటం. ఆయన కొడుకు ఇంట్లోంచి లేచిపోవడం.. ఆయన కుమార్తె జయశ్రీ ఉద్యోగం చేస్తూ యిల్లు చూడటం. ఒక రోజు పోలీసులు ఇంటికి రావడం... అర్జున్‌కై ప్రశ్నలు వేయడం... గోడకు వున్న అర్జున్ ఫోటో తీసుకొని వాళ్ళు వెళ్ళిపోవడం.. ఇదీ కథ. ఇలస్ట్రేటడ్ వీక్లీలో ప్రచురణైంది. ఈ సంకలనంలో మరణం గురించి కథలు సాగుతాయి. ప్రీతిష్ నంది కథలో మరణం కనిపించదు. కానీ కథ మరణం గురించే. ముగింపు వాక్యం ఇలా వుంటుంది "పోలీసులెప్పుడూ తిరిగిరాలేదు–అర్జున్ కూడా రాలేదు". మనసున్న ప్రతి వారికి కంట నీరు తెప్పించే టర్కిష్ కథ "మృత్యు భోజనాలు" దీన్ని టర్కిష్ కవి, నాటక కర్త సెనెదత్ కుద్రత్ రాసాడు. ఆ కవిని మానవీయ కోణంలో ఆవిష్కరించిన కథాంశం ఇది. దు:ఖంలోనూ, అంత్యక్రియల బరువులోనూ మునిగివున్న వారి అవసరాలను గమనించి తిండి సరఫరా చేస్తారు. టర్కీలో ఇతర పరిసర దేశాల్లోనూ అచారం వుంది (తిండి పంపుతారు). ఇక మృత్యుభోజనాలు కథలో.. నీళ్ళు కావడితో మోస్తూ కుటుంబం పోషించే "దర్శన్ ఆగా" చనిపోతాడు– అతడి భార్య గుల్నాజ్... భర్త పోయిన దు:ఖంలో వుంటుంది. బంగళా నుండి 'రయాస్' భోజనాలు పంపుతాడు.. అలా మూడురోజులు... చక్కటి భోజనం రావడం జరుగుతుంది. కొన్ని రోజులకు పిల్లలు ఆకలితో అలమటిస్తారు.–పెద్ద కొడుకు జ్వరంతో కదలకుండా అపస్మారక స్థితికి వెళ్ళడం. "అన్న చచ్చిపోతే మూల బంగళా వాళ్ళు భోజనం పంపిస్తారు గదూ!" అనే మాటతో కథ ముగుస్తుంది. చావుకన్నా ఆకలి భయంకరం అని తెలిపే కథ ఇది. దాదాపు 16 కథలు... కదిలిస్తాయి. ఓ మంచి కథా సంపుటి ఇది.

మరణ తరంగం కథలు
రచన : డా.కె.బి గోపాలమ్
పేజీలు :102, వెల రూ.100,
ప్రతులకు : వేదగిరి కమ్యూనికేషన్స్, హెచ్ఐజిఐ.1, బ్లాక్-6, ప్లాట్ నెం.10, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500044
సెల్ : 9391343916

[illegible]

- తంగిరాల చక్రవర్తి

కేశవర్ధినుల గ్రామం

మూరెడు జడ వుంటేనే ముప్పై వంకర్లు తిప్పతూ నడిచేవారిని చూస్తుంటాం. అలాంటిది ఆరడుగుల కురులుంటే...!? అదీ ఊళ్లోని ఆడవాళ్లందరికీ వుంటే!? రికార్డే కదా. మామూలు రికార్డు కాదండీ. గిన్నిస్ రికార్డు సాధించేశారు. ఇంతకీ ఈ గ్రామం ఎక్కడ వుందనుకున్నారు?! చైనాలోనే. పేరు... హువాంగ్‌లో యావో. మొత్తం ఇక్కడ రెండు వందల మంది మహిళలున్నారు. అందరివీ పొడవాటి కురులే. 5.5 అడుగుల నుంచి 6.8 అడుగుల పొడవు వరకు వుంటాయి వీరి కేశాలు. ఇక్కడి మహిళలకు జీవితంలో ఒక్కసారే వెంట్రుకలు కత్తిరిస్తారు. అదీ పదహారేళ్లప్పుడు. పెళ్లి వయసు వచ్చింది అనుకున్నప్పుడు. ఇప్పుడంటే వీరి నల్లటి కురుల సౌందర్యాన్ని ప్రపంచం అంతా వీక్షిస్తోంది కానీ... గతంలో ఇలా పరులకు చూపించేవారు కాదు. ఆఖరకు భర్తకు కూడా. అతను సైతం ఒకే ఒక్కసారి ఆమె వెంట్రుకుల అందాన్ని చూసే వీలుంది. అదీ పెళ్లినాడు. ఆ తర్వాత భర్త ముందర కూడా సంప్రదాయ ముడిలోనే వుండాలి. కురులు ఆరబోసుకుంటూ...దువ్వుకుంటూ కనిపించకూడదు. 1987లో అనుకుంటా! ఇబ్బందికరమైన ఈ నిబంధనను నిషేధించారు. వీరంతా దగ్గరలో వున్న జిన్‌జియాంగ్ నదిలో కురులను శుభ్రం చేసుకుని ... ఇళ్లకు చేరతారు. అంతా బానే వుంది కానీ... వెంట్రుకలు ఇంత పొడవు పెరగడం వెక రహస్యం ఏదైనా వుందా? వుంటే మేం కూడా ఫాలో అవుతాం కదా' అనుకుంటున్నారేమో! వాళ్లు తినే తిండి, తాగే నీళ్లు, పీల్చే గాలి... ఏవైనా కావొచ్చు. ఇవేవీ కాకపోతే జీన్స్‌లో వుండొచ్చు!! ●






కల'కాలం' నిలిచే కళ

కాలం కరిగిపోతుంది అనుకుంటాం. కానీ కాలం ఎక్కడికీ పోదు! మనతోనే వుంటుందనడానికి ఈ చిత్రరాజాలే నిదర్శనం. పక్కా భౌతికవాదులుగా కాకుండా...కాస్త కవితాత్మకంగా ఆలోచిస్తే...'నిజమేనే' అనిపించకమానదు. కదలబోమని మారాం చేసే గడియారాలతో సృజించినవీ కళాఖండాలు. పరిశీలనగా చూస్తే ... వాటిలో ఎన్నేసి ఆకారాలు కనిపిస్తాయనీ! గుర్రం, పులి, సింహం, కుక్క, నక్క పక్షి, పుర్రె.. మొదలుకొని మానవ, ఆకారాల వరకు అన్నిటినీ పోల్చుకోవచ్చు. ఇంతకీ ఈ కళాఖండాల బ్రహ్మ ఎవరనుకుంటున్నారు?! న్యూ జెర్సీకి చెందిన ఆర్టిస్టు సూ బియాట్రైస్! ఈమెకు పాడైపోయిన కాలమానాలను అలా వృధాగా పడేయడం అస్సలు ఇష్టముండదు! ఓపిగ్గా తనలోని సృజనాత్మకతనంతా రంగరించి తయారుచేసినవే ఇవన్నీ!